# ఇండోనేషియా అత్యున్నత పౌర పురస్కారం



**న్యూ ఢిల్లీ :** భారత ప్రధాని నరేంద్ర మోడీకి ఇండోనేషియా ప్రభుత్వం తమ దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'బింటాంగ్ ఆదిపూర్ణ రిపబ్లిక్ ఆఫ్ ఇండోనేసియా'ను ప్రకటించింది. ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును మోడీకి అందజేశారు. ఈ పురస్కారం భారత ప్రజలందరికీ లభించిన గౌరవంగా ప్రధాని అభివర్ణించారు. ఇండోనేసియా దేశ సార్వభౌమత్వానికి, అభ్యున్నతికి విశేష సేవలు అందించిన వారికి 1959 నుంచి ఈ అత్యున్నత గౌరవాన్ని అందజేస్తున్నారు. అంతకుముందు, జాకార్తాలోని అధ్యక్ష భవనం 'ఇస్తానా మెర్డెకా'కు చేరుకున్న ప్రధాని మోడీకి ఘన సైనిక వందనంతో అధికారిక స్వాగతం లభించింది. ఈ పర్యటన భారత్-ఇండోనేసియా మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని సరికొత్త శిఖరాలకు తీసుకెళ్తుందని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది.

**రక్షణ, ఆర్థిక రంగాల్లో కీలక మైలురాళ్లు..**

ఈ పర్యటనలో భాగంగా ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక బంధాన్ని బలోపేతం చేసే పలు కీలక నిర్ణయాలు జరిగాయి. భారతదేశ విజయవంతమైన ఎయిర్-టు-ఎయిర్ క్షిపణి 'అస్త్ర' ను దిగుమతి చేసుకోవడానికి ఇండోనేసియా నిర్ణయించింది. అలాగే, బ్రహ్మోస్ క్షిపణి సామర్థ్యాన్ని మరింత విస్తరించేందుకు భారత్ అదనపు బ్యాటరీల సాయం అందించనుంది. భారతదేశ ఎన్నికల నిర్వహణ నమూనాను ప్రశంసించిన ఇండోనేసియా.. తమ దేశం కోసం ప్రత్యేకంగా ఈవీఎంల అభివృద్ధికి భారత మద్దతును కోరింది. మలక్కా జలసంధికి ఆనుకుని, భారత్‌కు చెందిన గ్రేట్ నికోబార్ ప్రాజెక్టుకు కేవలం 100 మైళ్ల దూరంలో ఉన్న వ్యూహాత్మక 'సబాంగ్ ఓడరేవు' ను ఇరు దేశాలు సంయుక్తంగా అభివృద్ధి చేయనున్నట్లు అధికార వర్గాల సమాచారం.

**పురస్కారం విశిష్టత ఏంటి..?**

'బింటాంగ్ ఆదిపూర్ణ' అనేది రిపబ్లిక్ ఆఫ్ ఇండోనేషియాలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన, సర్వోన్నతమైన గౌరవ పతకం. ఇండోనేషియా దేశపు ఐక్యత, సమగ్రత, నిరంతర అభివృద్ధి మరియు శ్రేయస్సు కోసం అంతర్జాతీయంగా అసాధారణమైన రీతిలో కృషి చేసిన ప్రముఖులకు మాత్రమే ఈ అత్యున్నత అవార్డును బహూకరిస్తారు. భారత్--ఇండోనేషియా వ్యూహాత్మక బంధాన్ని నూతన శిఖరాలకు చేర్చడంలో ప్రధాని మోదీ చూపిన చొరవకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందజేస్తున్నట్లు ఇండోనేషియా ప్రభుత్వం తెలిపింది. గడిచిన కొన్నేళ్లలో ప్రధాని మోదీ పలు అంతర్జాతీయ దేశాల నుండి పొందిన అత్యున్నత పౌర పురస్కారాల జాబితాలో ఈ మెడల్ కూడా చేరింది.

# కేరళలో భారీ వర్షాలు..

**కేరళ :** కేరళలో కురుస్తున్న భారీ వర్షాలు మరోసారి వయనాడ్ జిల్లాలో ప్రమాదానికి దారితీశాయి. మంగళవారం మీప్పాడి సమీపంలోని కల్లాడి ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న సొరంగ మార్గం వద్ద భారీ కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో పలువురు కార్మికులు శిథిలాల కింద చిక్కుకున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. సహాయక బృందాలు వెంటనే రంగంలోకి దిగి గాలింపు చర్యలు చేపట్టాయి. వయనాడ్ ప్రాంతంలో సోమవారం అర్ధరాత్రి నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో భారీగా మట్టి, బండరాళ్లు ఒక్కసారిగా కొండపై నుంచి కూలిపడి నిర్మాణ ప్రాంతాన్ని పూర్తిగా కప్పివేశాయి. ప్రమాదం సంభవించగానే అక్కడ ఉన్న కార్మికులు ప్రాణభయంతో పరుగులు తీశారు. ప్రాథమిక సమాచారం ప్రకారం ఈ ఘటనలో కనీసం ఐదుగురు గాయపడగా, మరికొందరు మట్టిలో చిక్కుకుని ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, విపత్తు నిర్వహణ బృందాలు, స్థానిక అధికారులు కలిసి సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. భారీ వర్షాల కారణంగా రెస్క్యూ పనులకు ఆటంకం ఏర్పడుతోంది.

భారత వాతావరణ శాఖ కేరళలోని పలు జిల్లాలకు భారీ నుంచి అతి భారీ వర్షాల హెచ్చరికలు జారీ చేసింది. కొండ ప్రాంతాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దని అధికారులు సూచించారు.




# వరుసగా ఏడో రోజు రైతు భరోసా..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలోని అన్నదాతలకు పెట్టుబడి సాయం అందించే రైతు భరోసా పథకం పంపిణీ ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. ఇందులో భాగంగా ఏడో రోజు 8 ఎకరాల లోపు భూమి ఉన్న రైతులకు నిధులు విడుదల చేసినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. ఇవాళ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 58,831 మంది రైతుల బ్యాంక్ ఖాతాల్లో నేరుగా రూ. 259.73 కోట్లను ప్రభుత్వం జమ చేస్తోందని మంత్రి వివరించారు. అయితే, గడిచిన 7 రోజుల్లో 'రైతు భరోసా' కింద ప్రభుత్వం మొత్తం రూ. 7,750.45 కోట్లను రైతుల ఖాతాల్లోకి బదిలీ చేసిందని వెల్లడించారు. ఈ నిధుల ద్వారా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 68.96 లక్షల మంది అన్నదాతలకు పెట్టుబడి సాయం చేరిందని, మిగిలిన వారికి కూడా విడతల వారీగా రైతు భరోసా నిధులు జమ అవుతాయని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు స్పష్టం చేశారు.

# అధిక పాల కోసం కక్కుర్తి...

**గుమ్మడిదల(సంగారెడ్డి),ఫ్లాష్ ఇండియా :** పశువులకు పచ్చిగడ్డి, ఎండుగడ్డి, దాణా అందించాల్సింది పోయి.. కొందరు పశుపోషకులు మూగజీవాల ప్రాణాలను పణంగా పెడుతూ పాచిపోయిన బిర్యానీ, ఆహార పదార్థాలను పెడుతున్నారు. పట్టణాల్లోని హోటళ్లు, డాబాల నుంచి సేకరించిన పాచిపోయిన పదార్థాలను డ్రమ్ముల్లో తరలించి దాణాగా వేస్తున్నారు. గుమ్మడిదల మండలంలో ఈ ధోరణి ఆందోళన కలిగిస్తున్నది. గుమ్మడిదల మండల కేంద్రంతో పాటు దోమడుగు, అన్నారం, బొంతపల్లి, మంబాపూర్ తదితర గ్రామాల్లో ఈ పాచి బిర్యానీ దందా యథేచ్ఛగా కొనసాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. హైదరాబాద్, మెదక్ ప్రాంతాల్లోని హోటళ్లలో మిగిలిపోయిన ఆహార వ్యర్థాలను డీసీఎంలు, మినీ వాహనాల్లో పెద్ద పెద్ద ప్లాస్టిక్ డ్రమ్ముల్లో నింపి తీసుకొచ్చి పశుపోషకులకు విక్రయిస్తున్నారు. చౌకగా లభిస్తుందనే కారణంతో కొందరు పశుపోషకులు రాత్రి వేళల్లో ఈ వ్యర్థాలను తమ పశువులకు దాణాగా పెడుతున్నారు.

**పశువైద్య నిపుణుల హెచ్చరిక**

పాచిపోయిన మాంసాహార పదార్థాలు తీసుకోవడం వల్ల పశువులకు జీర్ణ సంబంధిత వ్యాధులు, ఫుడ్ పాయిజనింగ్, ఇతర తీవ్ర అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని పశువైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. కేవలం ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా, ఇలాంటి ఆహారం తీసుకున్న పశువుల నుంచి సేకరించే పాలలో దుర్వాసన వస్తుందని వారు స్పష్టం చేస్తున్నారు. అధిక పాల దిగుబడి వస్తాయనే ఆశతో కొందరు పశుపోషకులు ఈ అశాస్త్రీయ విధానాన్ని అనుసరిస్తుండటంతో పాల నాణ్యత దెబ్బతింటోందని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల పలువురు వినియోగదారులు తాము కొనుగోలు చేసే పాలు దుర్వాసన వస్తున్నాయని వాపోతున్నారు. పాల నాణ్యతపై తీవ్ర సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**పట్టించుకోని అధికారులు**

ప్రధాన రహదారుల పక్కనే పశువులకు పాచి బిర్యాని వేస్తున్న దృశ్యాలు అందరికీ కనిపిస్తున్నా చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. పట్టణ హోటళ్ల నుంచి వచ్చే ఆహార వ్యర్థాలను పశువులకు దాణాగా వినియోగించడాన్ని నియంత్రించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. పశు వైద్యశాఖ అధికారులు పశువులకు కలిగే నష్టాలను రైతులకు వివరించాలి. హోటళ్ల వ్యర్థాల రవాణాపై పర్యవేక్షణ పెంచి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

# 38 మందికి ఉరిశిక్ష ఖరారు

**గుజరాత్ :** 2008లో దేశాన్ని ఉలిక్కిపడేలా చేసిన అహ్మదాబాద్ వరుస బాంబు పేలుళ్ల కేసులో గుజరాత్ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసులో ప్రత్యేక న్యాయస్థానం విధించిన శిక్షలను హైకోర్టు సమర్థిస్తూ 38 మంది దోషులకు విధించిన మరణశిక్షను ఖరారు చేసింది. అలాగే 11 మంది దోషులకు విధించిన యావజ్జీవ కారాగార శిక్షను కూడా యథాతథంగా కొనసాగించింది. బాధిత కుటుంబాలకు, గాయపడిన వారికి నష్టపరిహారం చెల్లించాలని కూడా కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

**బాధితులకు నష్టపరిహారం**

హైకోర్టు ఆదేశాల మేరకు పేలుళ్లలో ప్రాణాలు కోల్పోయిన 56 మంది కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 10 లక్షల చొప్పున, గాయపడిన 200 మందికి పైగా బాధితులకు ఒక్కొక్కరికి రూ. 1 లక్ష చొప్పున పరిహారం అందించనున్నారు. కాగా, 2008 జూలై 26న అహ్మదాబాద్ నగరం వరుస బాంబు పేలుళ్లతో వణికిపోయింది. కేవలం 70 నిమిషాల వ్యవధిలో 21 బాంబులు పేలడంతో నగరంలో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. ఈ దాడుల్లో 56 మంది మరణించగా, 200 మందికి పైగా గాయపడ్డారు. దుండగులు సైకిళ్లపై అమర్చిన టిఫిన్ బాక్సుల్లో బాంబులను దాచిపెట్టి పేల్చారు. నగర బస్సులు, రద్దీ మార్కెట్లు, ఆసుపత్రులను లక్ష్యంగా చేసుకుని దాడులు జరిపారు. అనంతరం అహ్మదాబాద్, సూరత్ ప్రాంతాల్లో మరికొన్ని పేలని బాంబులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**ఇండియన్ ముజాహిదీన్ బాధ్యత స్వీకారం**

ఈ పేలుళ్లకు ఇండియన్ ముజాహిదీన్ అనే ఉగ్రవాద సంస్థ బాధ్యత వహిస్తున్నట్లు ప్రకటించింది. 2002 గుజరాత్ అల్లర్లకు ప్రతీకారంగా ఈ దాడులు నిర్వహించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసులో మొత్తం 78 మందిపై 35 వేర్వేరు కేసులు నమోదు చేయగా, విచారణ కోసం ప్రత్యేక న్యాయస్థానాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 14 సంవత్సరాల పాటు సాగిన విచారణ అనంతరం, 2022 ఫిబ్రవరిలో ప్రత్యేక కోర్టు తీర్పు వెలువరించింది. ఆ సమయంలో 49 మందిని దోషులుగా నిర్ధారించిన కోర్టు, వారిలో 38 మందికి మరణశిక్ష, 11 మందికి యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. సాక్ష్యాధారాలు లేకపోవడంతో 28 మందిని నిర్దోషులుగా విడుదల చేసింది. భారత న్యాయ చరిత్రలో ఒకేసారి 38 మందికి మరణశిక్ష విధించడం ఇదే తొలిసారి కావడం విశేషం.

**వేలాది పేజీల సాక్ష్యాలతో విచారణ**

ఈ కేసు విచారణలో 1,150 మందికి పైగా సాక్షుల వాంగ్మూలాలు నమోదు చేశారు. అనంతరం ప్రత్యేక న్యాయస్థానం 6,700 పేజీలకు పైగా ఉన్న తీర్పును వెలువరించింది. ఈ తీర్పును దోషులు గుజరాత్ హైకోర్టులో సవాలు చేయగా, అన్ని వాదనలు పరిశీలించిన హైకోర్టు ప్రత్యేక కోర్టు తీర్పును సమర్థిస్తూ తుది తీర్పు ఇచ్చింది. మొత్తంగా దేశాన్ని కుదిపేసిన అహ్మదాబాద్ వరుస బాంబు పేలుళ్ల కేసులో గుజరాత్ హైకోర్టు ఇచ్చిన ఈ తీర్పు ఉగ్రవాద కేసుల విచారణలో కీలక ఘట్టంగా నిలిచింది. బాధితులకు న్యాయం చేయడమే కాకుండా, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా కఠిన వైఖరిని మరోసారి స్పష్టం చేసింది.



# హుస్నాబాద్‌లో ఆరు దుకాణాలపై మున్సిపల్ కొరడా!

**హుస్నాబాద్,ఫ్లాష్ ఇండియా :** పట్టణంలో నిషేధిత ప్లాస్టిక్ వాడకం పై మున్సిపల్ అధికారులు విరుచుకుపడ్డారు. కమిషనర్ టి. మల్లికార్జున్ ఆదేశాలతో సానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం ఆధ్వర్యంలో మంగళవారం ముమ్మర తనిఖీలు చేపట్టారు. నిబంధనలు ఉల్లంఘించిన ఆరు దుకాణాలపై కొరడా ఝుళిపించి, రూ. 6,000 జరిమానా విధించారు. మైసూర్ బేకరీ కి రూ. 1,500, రాజస్థాన్ ఆశా పూరి స్వీట్ హౌస్, ఎస్.ఎల్.వి బెంగళూరు బేకరీ, రాందేవ్ జనరల్ స్టోర్స్, హనుమాన్ జనరల్ స్టోర్స్‌లకు రూ. 1,000 చొప్పున, ఆర్ఎస్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌కు రూ. 500 జరిమానా విధించారు. పర్యావరణానికి హాని కలిగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడితే ఉపేక్షించేది లేదని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ రవి కుమార్, జవాన్ శ్రీకాంత్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# శాశ్వత పరిష్కారం..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో రెవెన్యూ పరిపాలనను మరింత బలోపేతం చేయడం, ప్రజలకు ఆధునిక సేవలు అందించాలనే లక్ష్యంతో దశల వారీగా తహశీల్దార్, ఆర్డీవో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణాన్ని ప్రభుత్వం వేగవంతం చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. భవనాల నిర్మాణాలపై మంగళవారం అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొలి విడతలో అద్దె భవనాలు, శిథిలావస్థలో ఉన్న 107 తహశీల్దార్ కార్యాలయాలు, 10 ఆర్డీవో కార్యాలయాలకు రూ. 263 కోట్లతో, అలాగే స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి రూ. 97 కోట్లతో 48 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలు, నిజామాబాద్, వరంగల్ జిల్లాల్లో డీఐజీ కార్యాలయాలను నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఈ మొత్తం భవనాల కోసం రెండు విభాగాలకు సంబంధించి రూ. 360 కోట్లతో పరిపాలనా అనుమతులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ భవనాలన్నీ ఒకే నమూనాలో, ఆధునిక సౌకర్యాలతో నిర్మించి ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించేలా రూపొందిస్తామని చెప్పారు. వీటి నిర్మాణ బాధ్యతను తెలంగాణ హౌజింగ్ కార్పొరేషన్‌కు అప్పగించినట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు.

**శాశ్వత పరిష్కారం..**

అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు కొనసాగడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్న పరిస్థితికి శాశ్వత పరిష్కారం చూపేందుకు ఈ చర్యలు చేపడుతున్నామన్నారు. హౌజింగ్ అధికారులు జిల్లా స్థాయిలో రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకొని కొత్త భవనాల నిర్మాణానికి అవసరమైన స్థలాలను గుర్తించి, నిర్మాణ పనులను వేగంగా ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ, రిజిస్ట్రేషన్ సేవలందించే కార్యాలయాలు ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండేలా, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నిర్మించబడతాయని మంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికే ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 13 క్లస్టర్‌లుగా విభజించి ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను నిర్మిస్తున్నామని, ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండా ప్రైవేటు నిర్మాణ రంగ సంస్థలతో నిర్మిస్తున్నామని తెలిపారు. ఐదు సంవత్సరాల నిర్వహణ బాధ్యతను కూడా ఆ సంస్థలే తీసుకున్నాయని, ఇప్పటికే నాలుగు ప్రాంతాల్లో ఇంటిగ్రేటెడ్ భవనాలకు శంకుస్థాపన చేయగా, నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయని మంత్రి పొంగులేటి తెలిపారు.

# డీఎస్పీ భీమ్ రెడ్డి అరెస్ట్



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ పోలీస్ శాఖలో సంచలనంగా మారిన డీఎస్పీ భీమ్ రెడ్డి అక్రమాస్తుల కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో హైదరాబాద్‌లోని పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్ విభాగంలో డీఎస్పీగా పనిచేస్తున్న సంకిరెడ్డి భీమ్‌రెడ్డిని అవినీతి నిరోధక శాఖ అధికారులు సోమవారం సాయంత్రం అధికారికంగా అరెస్ట్ చేశారు. ఐదు రోజుల క్రితం భీమ్‌రెడ్డి ఇల్లు, కార్యాలయాలతో పాటు ఆయన బంధువులు, బినామీలకు చెందిన 16 ప్రాంతాల్లో ఏసీబీ బృందాలు ఏకకాలంలో జరిపిన మెరుపు సోదాల అనంతరం ఈ అరెస్ట్ చోటుచేసుకుంది. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించిన పోలీసులు జడ్జి ముందు హాజరు పరిచారు. దీంతో అతనికి 14 రోజుల రిమాండ్ విధించగా ఏసీబీ అధికారులు భీమ్ రెడ్డిని చంచల్ గూడ జైలుకు తరలించారు. ఇదిలా ఉంటే పూర్తి స్థాయి విచారణ కోసం ఏసీబీ అధికారులు ఆయనను కస్టడీకి కోరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.



# నా శాఖతో అతనికేం సంబంధం?

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ కాంగ్రెస్ లో మరోసారి మంత్రి కొండా సురేఖ వర్సెస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య విభేదాలు భగ్గుమంటున్నాయి. తన శాఖలో కడియం శ్రీహరి జోక్యం చేసుకోవడం పట్ల ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిన్న దేవాదాయ కమిషనర్ ఆఫీసులో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని నా ఆఫీసులో నాకు తెలియకుండా నా శాఖ అధికారులతో రివ్యూ చేయడం ఏంటని సురేఖ మండిపడ్డారు. ఈ మేరకు కడియం శ్రీహరి తీరుపై ఏకంగా కాంగ్రెస్ అధిష్టానానికి మంత్రి ఫిర్యాదు చేయడంతో ఇద్దరి మధ్య పొలిటికల్ కుమ్ములాట హాట్ టాపిక్ గా మారింది.

**ఈ మధ్య సయోధ్య ఇంతలోనే..**

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా రాజకీయ వ్యవహారం సాగుతోంది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య విభేదాలు తారాస్థాయికి చేరడంతో గతంలో పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. ఆ క్రమంలో మంత్రి కొండా సురేఖ, ఆమె భర్త కొండా మురళిపై కడియం శ్రీహరి తో పాటు ఉమ్మడి వరంగల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కొందరు ఏకంగా రాష్ట్ర నేతలకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంలో కొండామురళి టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ ఎదుట హాజరు కూడా అయ్యారు. ఈ రెండు వర్గాల మధ్య వివాదం ముదిరి పార్టీకి డ్యామేజ్ చేయబోతోందని భావించిన పార్టీ పెద్దల గాంధీ భవన్ వేదికగా జోక్యం చేసుకున్నారు. దీంతో ఇరు వర్గాల మధ్య ఇప్పుడిప్పుడే వీరి మధ్య సయోధ్య కుదిరి వివాదం సద్దుమణిగిందని అంతా భావిస్తున్న తరుణంలో తాజాగా కడియం శ్రీహరిపై మంత్రి కొండా సురేఖ ఏఐసీసీకి ఫిర్యాదు చేయడం చర్చనీయాంశంగా మారింది. తాజా పరిణామాలు తెలంగాణ కాంగ్రెస్‌లో ఎలాంటి పరిస్థితులకు దారి తీయబోతున్నాయో మరి!.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా
మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# చిన్నారులే దేశ సంపద..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఎంసీఆర్ హెచ్ఆర్డీలో మొబైల్ అంగన్వాడి వాహనాన్ని ప్రారంభించిన మంత్రులు సీతక్క, వివేక్ చిన్నారులే దేశ సంపద, దేశ భవిష్యత్తని, తెలంగాణ--2047 లక్ష్య సాధనలో నేటి చిన్నారులే కీలక పాత్ర పోషిస్తారని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. అందుకే ఏ ఒక్క చిన్నారికీ అంగన్వాడి సేవలు అందకుండా ఉండకూడదనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం మొబైల్ అంగన్వాడి కేంద్రాలను ప్రారంభిస్తోందని తెలిపారు. ఎంసీఆర్ హెచ్ఆర్డీలో కార్మిక శాఖ మంత్రి వివేక్‌తో కలిసి కార్మిక శాఖ సహకారంతో మహిళా, శిశు సంక్షేమ శాఖ రూపొందించిన మొబైల్ అంగన్వాడి వాహనాన్ని మంత్రి సీతక్క జెండా ఊపి ప్రారంభించారు. ఈ మొబైల్ అంగన్వాడి వాహనం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని ఇందిరమ్మ కాలనీ లో అంగన్వాడి సేవలు అందించనుంది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, ఇప్పటివరకు సాంప్రదాయ అంగన్వాడి కేంద్రాలకు వచ్చే చిన్నారులకే పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ, ప్రీ-స్కూల్ విద్య, తల్లి శిశు సంక్షేమ సేవలు అందుబాటులో ఉండేవని, అయితే అంగన్వాడి కేంద్రాలు లేని ప్రాంతాల్లో నివసించే చిన్నారులు, ముఖ్యంగా పనుల కోసం హైదరాబాద్ వంటి నగరాలకు వలస వచ్చే కార్మికుల పిల్లలు ఈ సేవలకు దూరమవుతున్నారని అన్నారు. అలాంటి ఒక్క చిన్నారి కూడా ప్రభుత్వ సేవలకు దూరం కాకూడదనే లక్ష్యంతో ఈ మొబైల్ అంగన్వాడి కేంద్రాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని చెప్పారు. అంగన్వాడి కేంద్రాల్లో లభించే అన్ని సేవలు మొబైల్ అంగన్వాడి కేంద్రాల్లో కూడా అందుబాటులో ఉంటాయని మంత్రి తెలిపారు. పోషకాహారం, ఆరోగ్య పరీక్షలు, ఎదుగుదల పర్యవేక్షణ, ప్రీ-స్కూల్ విద్యతో పాటు తల్లి శిశు సంక్షేమానికి సంబంధించిన అన్ని సేవలను ఈ వాహనాల ద్వారా అందిస్తామని చెప్పారు. వలస కార్మికులు ఎక్కువగా నివసించే ప్రాంతాలకు ఈ మొబైల్ అంగన్వాడి వాహనాలు నేరుగా వెళ్లి సేవలు అందిస్తాయని పేర్కొన్నారు. ఒక్కో మొబైల్ అంగన్వాడి వాహనం దాదాపు పది అంగన్వాడి కేంద్రాలకు సమానంగా సేవలు అందించే సామర్థ్యాన్ని కలిగి ఉందని, ఒక్కో మొబైల్ అంగన్వాడి కేంద్రం ద్వారా సుమారు 300 మంది లబ్ధిదారులకు సేవలు అందనున్నాయని మంత్రి సీతక్క తెలిపారు. ప్రభుత్వం సేవలను ప్రజలు ఉన్న చోటుకే తీసుకెళ్లాలన్న ఆలోచనతో ఈ కార్యక్రమాన్ని రూపొందించిందన్నారు. చిన్నారి చిరునవ్వే నిజమైన అభివృద్ధికి ప్రతీక అని పేర్కొన్న మంత్రి సీతక్క, స్వాతంత్ర్యోద్యమ తొలి దశల్లో గ్రామాలకు వెళ్లి అక్షరాస్యత, విజ్ఞానాన్ని పంచిన చైతన్య రథాల మాదిరిగానే ఈ మొబైల్ అంగన్వాడి కేంద్రాలు కూడా ప్రతి చిన్నారికి పోషకాహారం, ఆరోగ్యం, విద్యను చేరవేసి ఆరోగ్యవంతమైన భావితరాన్ని నిర్మించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రతి చిన్నారి సమగ్ర అభివృద్ధికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ సెక్రెటరీ శృతి ఓజా, జాయింట్ డైరెక్టర్ మోతి, మేడ్చల్ మల్కాజ్గిరి డి డబ్ల్యూ ఓ శారద, కార్మిక మహిళా శిశు సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




## కాక్రోచ్ జనతా పార్టీకి భారీ ఊరట..

**న్యూఢిల్లీ :** ఢిల్లీ హైకోర్టులో కాక్రోచ్ జనతా పార్టీకి పెద్ద ఊరట లభించింది. వివాదాస్పద కారణాల వల్ల గతంలో నిలిపివేసిన ఆ పార్టీ అధికారిక సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' ఖాతాను తక్షణమే పునరుద్ధరించాలని ఢిల్లీ హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

**కేంద్ర ప్రభుత్వ అభ్యంతరాల్లో అర్థం లేదు: హైకోర్టు వ్యాఖ్యలు**

నీట్ పరీక్ష ముగిసిన నేపథ్యంలో, ఈ అకౌంట్‌పై కేంద్ర ప్రభుత్వం వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలను కోర్టు తోసిపుచ్చింది. నీట్ ఎగ్జామ్స్ పూర్తయిన ప్రస్తుత తరుణంలో, సదరు పార్టీ సోషల్ మీడియా ఖాతాను ఇంకా హోల్డ్‌లో ఉంచడం లేదా నిషేధాన్ని కొనసాగించడంలో ఎలాంటి అర్థం లేదని హైకోర్టు అభిప్రాయపడింది. పరీక్షల నిర్వహణ సమయంలో శాంతిభద్రతలు లేదా ఇతర సాంకేతిక కారణాల దృష్ట్యా ఆంక్షలు విధించినప్పటికీ, ఇప్పుడు వాటిని పొడిగించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. హైకోర్టు తాజా ఉత్తర్వులతో కాక్రోచ్ జనతా పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. కోర్టు ఆదేశాల నేపథ్యంలో మరో 24 నుంచి 48 గంటల్లో సీజేపీ అధికారిక 'ఎక్స్' హ్యాండిల్ తిరిగి యాక్టివేట్ అయ్యే అవకాశం ఉంది.

# బీఎల్ఓలను ఎంఐఎం కాంగ్రెస్ బెదిరిస్తోంది..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్ 2026) ప్రక్రియలో పలు అక్రమాలు జరుగుతున్నాయని, కాంగ్రెస్, ఎంఐఎం కలిసి బీఎల్ఓలను బెదిరిస్తున్నారని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు అరోపించారు. ఈ మేరకు ఇవాళ తెలంగాణ బీజేపీ నేతల బృందం రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ని కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన వరుస ప్రభుత్వాలు ఏఐఎంఐఎం పార్టీకి మితిమీరిన ప్రాధాన్యత ఇస్తున్నాయని లేఖలో బీజేపీ ఆరోపించింది. క్షేత్రస్థాయిలో అందుతున్న సమాచారం ప్రకారం 'సర్ 2026' ప్రక్రియ సజావుగా సాగడం లేదని తక్షణమే ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకుని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

**ఎంఐఎం నేతలకు ఈసీఐ యాప్ యాక్సెస్:**

సీఈవోను కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడిన రామచందర్ రావు.. హైదరాబాద్ పాతబస్తీలో బూత్ లెవల్ అధికారులు ఇళ్ల వద్దకు వెళ్లి 'ఎన్యూమరేషన్ ఫారాలు' పంపిణీ చేయడం లేదని రామచందర్ రావు ఆరోపించారు. ఈ విషయాన్ని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకువెళ్లామన్నారు. బీఎల్వోలు ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేయకుండా అడ్డుకోవడమే కాకుండా దానికి బదులుగా ఎంఐఎం నాయకులు ఏర్పాటు చేసిన క్యాంపులకు వెళ్లి అక్కడ బల్క్‌గా ఫారాలను పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. నింపిన ఫారాలను అప్‌లోడ్ చేయడానికి వీలుగా ఎన్నికల సంఘం యాప్ యాక్సెస్‌ను కూడా ఎంఐఎం నేతలకు ఇస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు.

**ఒకే కుటుంబం.. వేర్వేరు పోలింగ్ బూత్‌లు:**

జీహెచ్ఎంసీ , సైబరాబాద్, మల్కాజ్‌గిరి, వరంగల్, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో చాలా మంది ఓటర్లకు ఇంకా ఎన్యూమరేషన్ ఫారాలు అందలేదని వివరించింది. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్ల పేర్లు వేర్వేరు పోలింగ్ బూత్‌లలో ఉండటంతో ఇళ్లను గుర్తించడం బీఎల్ఓలకు కష్టంగా మారింది. ఓటర్లు ఇంట్లో లేకపోతే కనీసం 3 సార్లు బీఎల్ఓలు వారి ఇంటికి వెళ్లడాన్ని తప్పనిసరి చేయాలని కోరినట్లు తెలిపారు.

**భాషా సమస్యలు:**

ఉపాధి, విద్య, వ్యాపారాల కోసం ఇతర రాష్ట్రాల నుండి వచ్చి తెలంగాణలో స్థిరపడిన వారు తెలుగు చదవడం, రాయడం లేక ఇబ్బంది పడుతున్నారని.. కాబట్టి హైదరాబాద్‌తో పాటు జిల్లాల్లోనూ ఇంగ్లీష్, తెలుగు రెండు భాషల్లో ఫారాలను అందుబాటులో ఉంచాలని సీఈవోనుకోరినట్లు తెలిపారు. సమస్యలన్నింటినీ వెంటనే పరిష్కరించి తెలంగాణలో 'సర్ 2026' ప్రక్రియను పారదర్శకంగా కోరారు.

## హిమాన్షుకు గాయంపై కేటీఆర్ ఎమోషనల్ ట్వీట్..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** గాయం కారణంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కుమారుడు హిమాన్షు ప్రమాదంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. 'నిన్న సాయంత్రం స్పోర్ట్స్ ఆడుతుండగా తన కుమారుడు హిమాన్షు గాయపడినట్లు తెలిపారు. ఈ ఘటనలో అతడు చిన్న గాయం అయిందని ప్రస్తుతం అతడికి చికిత్స కొనసాగుతోంది. మరో కొన్ని రోజుల్లో అతను పూర్తిగా కోలుకుని సాధారణ స్థితికి వస్తాడు. అతని ఆరోగ్యం గురించి ఆందోళన వ్యక్తం చేస్తూ ఫోన్ చేసిన, సందేశాలు పంపిన ప్రతి ఒక్కరికీ మా హృదయపూర్వక ధన్యవాదాలు' అంటూ ఎక్స్ వేదికగా పోస్టు చేశాడు.

**హిమాన్షు ట్వీట్:**

తన ఇంజూరిపై హిమాన్షు సైతం ఎక్స్ వేదికగా స్పందించారు. క్రీడలకు సంబంధించిన గాయం కారణంగా నిన్న రాత్రి నేను ఆసుపత్రిలో చేరానని ప్రస్తుతం నేను బాగానే ఉన్నాని పోస్టు చేశారు. కొన్ని రోజులు విశ్రాంతి తీసుకుని కోలుకోవాలని వైద్యులు సలహా ఇచ్చారని, మీ అందరి అవగాహన, ప్రేమ మరియు మద్దతుకు ధన్యవాదాలు. త్వరలోనే మళ్లీ తిరిగి రావాలని ఆశిస్తున్నాను అంటూ పోస్టు చేశారు. కాగా, గాయపడి చికిత్స పొందుతున్న హిమాన్షు త్వరగా కోలుకోవాలని పలువురు నెటిజన్లు సోషల్ మీడియాలో కామెంట్స్ చేస్తున్నారు.

**ఆసుపత్రికి చేరుకున్న కేసీఆర్:**

మరో వైపు తన మనవడు హిమాన్షు ను పరామర్శించేందుకు కేటీఆర్ గచ్చిబౌలి AIG ఆసుపత్రికి చేరుకున్నారు. హిమాన్షు గాయపడిన సంగతి తెలిసిన కేసీఆర్ ఇవాళ ఎర్రవల్లి ఫామ్ హౌస్ నుంచి ఆసుపత్రికి బయలుదేరి వచ్చారు. కొద్ది సేపటి క్రితమే ఆయన ఆసుపత్రికి చేరుకుని హిమాన్షు ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.

# డిజిటల్ గవర్నెన్స్‌కు గ్రీన్ సిగ్నల్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** పరిపాలనలో మరింత పారదర్శకత కోసం వ్యవస్థను పూర్తిస్థాయిలో డిజిటలైజ్ చేయాలని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో డిజిటల్ గవర్నెన్స్ దిశగా సమగ్ర ప్రణాళికలను సిద్ధం చేసి అవసరమైన మేరకు చట్టాలను రూపొందించాలని చెప్పారు. రాష్ట్రంలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై ముఖ్యమంత్రి గారు ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్‌లో ఉన్నతాధికారులతో సమీక్షించారు. ప్రజలకు మెరుగైన సేవలను అందించడంతో పాటు సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు చేరే విధంగా డిజిటల్ గవర్నెన్స్ అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 1వ తారీఖున జీతాలు అందించేలా వివరాలను పూర్తిగా డిజిటలైజ్ చేయాలని స్పష్టంగా చెప్పారు. వివిధ విభాగాలలోని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, జీతాలు, బ్యాంక్ అకౌంట్ వివరాలను డిజిటలైజ్ చేయాలన్నారు. రాష్ట్రంలో దాదాపు 4,800 కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు ఉండగా, ఇందులో 4,300 ఏజెన్సీలు ఉద్యోగులకు ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించడం లేదని అధికారులు ముఖ్యమంత్రి గారి దృష్టికి తెచ్చారు. ఏజెన్సీలకు ప్రభుత్వం చెల్లింపులు చేసినా, ఉద్యోగులకు సమయానికి జీతాలు చెల్లించడం లేదని తెలిపారు. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించి అలాంటి ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు అధికారులను ఆదేశించారు. డిజిటల్ గవర్నెన్స్‌తో ఇలాంటి సమస్యలకు చెక్ పెట్టాలని సూచించారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు 1 నుంచి గరిష్టంగా 5వ తేదీలోగా పారదర్శకంగా జీతాలు చెల్లింపులు జరిపేందుకు డిజిటల్ గవర్నెన్స్ ఉపయోగపడుతుందని అన్నారు. అందుకే పూర్తి వివరాలను డిజిటలైజ్ చేయాలని తెలిపారు. ప్రభుత్వం నుంచి చెల్లింపులు జరిగినప్పటికీ సమయానికి ఉద్యోగులకు జీతాలు చెల్లించని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. దీనిపై పూర్తిస్థాయిలో కసరత్తు చేసేందుకు వీలుగా ఒక ఉన్నత స్థాయి కమిటీని నియమించాలని ముఖ్యమంత్రి గారు సూచించారు. ఈ కమిటీ 100 రోజుల్లో నివేదిక సమర్పించి ఈ అంశాన్ని ఒక కొలిక్కి తీసుకురావాలని ఆదేశించారు. హెల్త్ కార్డులు, ఇతర బెనిఫిట్స్ అమలు చేసేందుకు ప్రభుత్వ ఉద్యోగుల వివరాలను కూడా డిజిటలైజ్ చేయాలని సూచించారు. నిరంతరం మానీటరింగ్ చేసేందుకు ఆర్థిక శాఖ విభాగం ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి గారు, సలహాదారు కె. రామకృష్ణారావు గారు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గారు, MA&UD ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ గారు, ఎంసీఆర్ హెచ్ఆర్డీ వైస్ చైర్మన్ శాంతి కుమారి గారితో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సీఎంకు మేధావుల బహిరంగ లేఖ

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలోని 27,000 ప్రభుత్వ పాఠశాలల సంఖ్యను 4,000 లకు కుదించి, మిగిలిన బడులను మూసివేస్తామంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రకటనపై రాష్ట్రవ్యాప్తంగా విద్యావేత్తలు, మేధావులు, పౌర సమాజం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు జూలై 07న జస్టిస్ బి. చంద్రకుమార్, జస్టిస్ రాధారాణి, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ కోదండరాం, ప్రొఫెసర్ నాగేశ్వర్, దేశపతి శ్రీనివాస్, గోరటి వెంకన్న సహా మంది ప్రముఖ విద్యావేత్తలు, న్యాయమూర్తులు, సామాజిక విశ్లేషకులు, పౌర సమాజ ప్రతినిధులు సంతకాలతో కూడిన ఒక సుదీర్ఘ బహిరంగ లేఖను ముఖ్యమంత్రికి సమర్పించారు. 23,000 పాఠశాలల మూసివేత ఆలోచనను తక్షణమే విరమించుకోవాలని, ఈ నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జూన్ 6వ తేదీన బెంగళూరులో జరిగిన ఒక చర్చా కార్యక్రమంలో ముఖ్యమంత్రి చేసిన ఈ ప్రకటన తీవ్ర విద్యా, సామాజిక పరిణామాలకు దారితీస్తుందని లేఖలో హెచ్చరించారు.

**విద్యాహక్కు చట్టం ఉల్లంఘన..**

రాజ్యాంగంలోని ఆర్టికల్ 27A, విద్యా హక్కు చట్టం ప్రకారం పిల్లలందరికీ ఉచిత, నిర్బంధ విద్యనందించడం ప్రభుత్వ కనీస బాధ్యత అని మేధావులు గుర్తుచేశారు. ఈ నిర్ణయం అమలులోకి వస్తే రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలలో దాదాపు 500 గ్రామాల్లో ప్రాంతాలకు బడులు దూరమైతే రవాణా, భద్రతా కారణాల వల్ల బడులు శాశ్వతంగా మూతపడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. బడుగు, బలహీన వర్గాల పిల్లలు, ముఖ్యంగా ఆడపిల్లలు చదువు మధ్యలోనే ఆపేసి బాల కార్మికులుగా మారే ప్రమాదం ఉందని, ఇది దేశ చరిత్రలోనే అత్యంత తిరోగమన చర్యగా మిగిలిపోతుందని స్పష్టం చేశారు.

**కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో వాగ్దానాల ఉల్లంఘన..**

ఎన్నికల మేనిఫెస్టోలో విద్యపై పెట్టి ఖర్చు, భవిష్యత్తుపై పెట్టుబడి అని పేర్కొంటూ బడ్జెట్లో విద్యకు 15% నిధులు కేటాయిస్తామని కాంగ్రెస్ వాగ్దానం చేసినప్పటికీ, ప్రస్తుతం కేటాయింపులు చేసిన దాఖలాలు లేవని లేఖలో ఎండగట్టారు. గత ప్రభుత్వం మూసివేసిన 6,000 పాఠశాలలను మెరుగైన సదుపాయాలతో తిరిగి తెరుస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు ఏకంగా 2,000 పాఠశాలలను మూసివేయాలని తలపెట్టడం అత్యంత విషాదకరమని పేర్కొన్నారు. ప్రభుత్వ బడులలో జీరో ఎన్రోల్మెంట్ ఏర్పడటానికి పాలకుల నిర్లక్ష్యం విద్యాశాఖలో పర్యవేక్షణ లోపమే ప్రధాన కారణమని మేధావులు లేఖలో గణాంకాలతో సహా వివరించారు.

**తక్షణమే చేపట్టవలసిన చర్యలు..**

బడుల మూసివేత ప్రకటనను తక్షణమే ఉపసంహరించుకోవాలి.

అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తక్షణమే పూర్వ ప్రాథమిక విద్యను ప్రవేశపెట్టి, ప్రతీ చిన్నగ్రామంలో ప్రాథమిక పాఠశాలను కొనసాగించాలి.

అన్ని బడులలో అవసరమైన తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీరు, డిజిటల్ పనులు సమకూర్చాలి.

ఖాళీగా ఉన్న అన్ని బోధన, బోధనేతర పోస్టులను భర్తీ చేయాలి. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించరాదు.

ప్రైవేటు పాఠశాలలను అదుపు చేసేందుకు జీవో నెంబర్ 1ను పకడ్బందీగా అమలు చేయాలి.

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోకపోతే తెలంగాణ సమాజ భవిష్యత్తు ప్రశ్నార్థమవుతుందని, కావున ముఖ్యమంత్రి తమ నిర్ణయాన్ని తక్షణమే పునఃసమీక్షించుకోవాలని లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు.

# సింగరేణికి కేంద్రం పూర్తి సహాయ సహకారాలు

**న్యూఢిల్లీ :** దేశాభివృద్ధి విషయంలో సహకార సమాఖ్య విధానంతో అన్ని రాష్ట్రాలు కలిసి ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఈరోజు(మంగళవారం) మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ సింగరేణి కోల్ కాలరీస్ లిమిటెడ్ అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం గత 12 ఏళ్లుగా అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తోందని తెలిపారు. 39 వర్కింగ్ మైన్స్‌లో 21 అండర్ గ్రౌండ్ మైన్స్, 18 ఓపెన్ కాస్ట్ మైన్స్ ఉన్నాయని.. సుమారు 6 నుంచి 8 జిల్లాల్లో సింగరేణి బొగ్గు గనులు విస్తరించి ఉన్నాయని అన్నారు. లక్షలాది ప్రజల గుండెచప్పుడు సింగరేణి అని వెల్లడించారు. సింగరేణికి సంబంధించిన మేజర్ మైనింగ్ ప్రాజెక్టుల ఎన్విరాన్మెంటల్, ఫారెస్ట్ క్లియరెన్స్‌లను వేగవంతం చేయడంలో కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తోందని కిషన్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ఉద్యమంలోనూ సింగరేణి కార్మికులు భాగస్వాములయ్యారని తెలిపారు. కార్మికుల ధైర్యాన్ని తెలంగాణ ప్రజలు ఎన్నటికీ మరిచిపోరన్నారు. ఒడిశాలో నైనీ కోల్ బ్లాక్ సింగరేణికి వచ్చేలా కృషి చేసినట్లు తెలిపారు. సింగరేణి




పురోగతికి తన వంతు సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణతో పాటుగా ఇతర రాష్ట్రాల్లో జరిగే బొగ్గు గనుల వేలంలో పాల్గొనేలా సింగరేణి ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు. నైనీ కోల్ బ్లాక్‌లో సుమారు 340 మిలియన్ టన్నుల బొగ్గు రిజర్వ్ ఉన్నాయన్నారు. 30 నుంచి 35 సంవత్సరాలకు సరిపోయే బొగ్గు ఉందని తెలిపారు. ఏటా 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసే అవకాశం సింగరేణికి లభించిందని.. దీని వల్ల సింగరేణికి సుమారు రూ.75 వేల కోట్ల రెవెన్యూ వచ్చే అవకాశం ఉందన్నారు. సింగరేణికి తాడిచర్ల-2 బొగ్గు గనులు కేటాయించామని కిషన్ రెడ్డి తెలిపారు. తాడిచర్ల-2 బొగ్గు గనులపై తుది నిర్ణయం తీసుకున్నామన్నారు. దాదాపు 182 మిలియన్ టన్నుల బొగ్గు రిజర్వ్ ఉన్న ఈ బ్లాక్ ద్వారా.. ఏటా 6 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరుగుతుందన్నారు. దాదాపు 40 నుంచి 50 ఏళ్ల పాటు ఈ గని నుంచి బొగ్గు ఉత్పత్తి జరుగుతుందని చెప్పుకొచ్చారు. దీని ద్వారా మొత్తంగా రూ.64,000 కోట్లకు పైగా రెవెన్యూ వచ్చే అవకాశం ఉందని తెలిపారు. నేరుగా సింగరేణికి ఈ గని ఇవ్వడం ద్వారా ఆక్షన్ ప్రీమియం చెల్లింపు లేని కారణంగా ఆ సంస్థకు కనీసం రూ.2,550 కోట్లు మిగులుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వానికి రాయల్టీ సహా వివిధ మార్గాల్లో దాదాపు రూ.16 వేల కోట్ల వరకు ఆదాయం సమకూరుతుందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

# సంస్థాగత నిర్మాణం,పార్టీ బలోపేతం పై దృష్టి సారించండి

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** సంస్థాగత నిర్మాణం,పార్టీ బలోపేతం పై దృష్టి సారించాలని పార్టీ శ్రేనులకు బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానెలిస్టు డా.ప్రభ గౌడ్ పిలుపునిచ్చారు. సంస్థాగత నిర్మాణం, సభ్యత్వ విస్తరణ, ప్రజా సమస్యలపై చేపట్టాల్సిన కార్యక్రమాలు, సంస్థాగత నిర్మాణం, సభ్యత్వ విస్తరణ, ప్రజా సమస్యలపై చేపట్టాల్సిన కార్యక్రమాలు, రాబోయే పార్టీ కార్యాచరణపై ప్రభ గౌడ్ విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు రామ్ చందర్ రావు , చంద్ర శేఖర్ జి , చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావు ,బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర భారతీయ జనతా పార్టీ రంగారెడ్డి అర్బన్ జిల్లా ఆధ్వర్యంలో ఎల్‌బీ నగర్‌లోని వన్ కన్వెన్షన్ హాల్‌లో జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానెలిస్టుడా. ప్రభా గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో పార్టీ బలోపేతం, సంస్థాగత నిర్మాణం, సభ్యత్వ విస్తరణ, ప్రజా సమస్యలపై చేపట్టాల్సిన కార్యక్రమాలు, రాబోయే పార్టీ కార్యాచరణపై ప్రభ గౌడ్ విస్తృతంగా చర్చించారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు రామ్ చందర్ రావు , చంద్ర శేఖర్ జి , చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావు ,బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర పదాధికారులు, రాష్ట్ర వివిధ మోర్చాల పదాధికారులు, జిల్లా కమిటీ సభ్యులు, మాజీ కార్పొరేటర్లు, జిల్లా మోర్చాల అధ్యక్షులు మరియు ప్రధాన కార్యదర్శులు, జిల్లా శాశ్వత కమిటీ సభ్యులు, జిల్లా ప్రత్యేక ఆహ్వాన కమిటీ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, జిల్లా కౌన్సిల్ సభ్యులు తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..



## సంపాదకీయం




# నైపుణ్య తెలంగాణే లక్ష్యంగా..

చేపలు ఇవ్వడం కాదు, చేపలు పట్టడం నేర్పించాలి' బాగా ప్రాచుర్యం పొందిన ఈ సామెత నేటి విద్యావిధానాల దిశను స్పష్టంగా ప్రతిబింబిస్తోంది. ఒకరికి చేపలు ఇస్తే ఒకరోజు జీవిస్తాడు. అదే చేపలు పట్టడం నేర్పిస్తే జీవితాంతం బతకగలడు. ఇదే భావన ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వ విధానాలకు కేంద్రంగా మారింది. నైపుణ్యాభివృద్ధి పెంపుపై ప్రత్యేక దృష్టి సారిస్తూ.. మార్కెట్, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యను ఉపాధితో అనుసంధానించే చర్యలను ప్రజా ప్రభుత్వం వేగవంతం చేస్తోంది. కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా ప్రభుత్వ పాఠశాలల బలోపేతం నుంచి అంతర్జాతీయస్థాయి నైపుణ్యాల కల్పన వరకు సీఎం రేవంత్‌రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలు రాష్ట్ర విద్యారంగాన్ని సరికొత్త పథంవైపు నడిపిస్తున్నాయి. విద్యను కేవలం డిగ్రీలు అందించే వ్యవస్థగా కాకుండా, జీవితాన్ని నిర్మించేశక్తిగా మార్చేందుకు ఆయన చర్యలు తీసుకుంటున్నారు. 2024 ఆగస్టు 1న ప్రతిష్టాత్మకంగా యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటుచేసింది. ఇంటర్, డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఉద్యోగ మార్కెట్‌కు అవసరమైన నైపుణ్యాలను అందించడం దీని ప్రధాన లక్ష్యం. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో నడుస్తున్న ఈ విశ్వవిద్యాలయానికి సీఎం రేవంత్ రెడ్డి చాన్సలర్‌గా ఉండగా, ప్రముఖ పారిశ్రామికవేత్తలతో కూడిన బోర్డ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ పర్యవేక్షిస్తోంది. పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహీంద్రా నేతృత్వంలో హైదరాబాద్ ట్రిపుల్ ఐటీలోని తాత్కాలిక క్యాంపస్‌లో హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్, ఫార్మా, లాజిస్టిక్స్, బ్యాంకింగ్--ఫైనాన్షియల్ వంటి రంగాల్లో స్వల్పకాలిక, సర్టిఫికేషన్ కోర్సులను అందిస్తున్నారు. టెక్స్ట్ బుక్ చదువులకు స్వస్తి చెప్పి, పరిశ్రమల అవసరాలకు తగ్గట్టు శిక్షణ ఇవ్వాలనే రేవంత్ రెడ్డి విజన్‌కు నిదర్శనంగా.. ఇటీవల ఈ యూనివర్సిటీలో 'డేటా సెంటర్ మేనేజ్‌మెంట్' కోర్సు పూర్తి చేసుకున్న 14 మంది విద్యార్థుల్లో 11 మందిని ప్రముఖ గ్లోబల్ ఐటీ దిగ్గజం 'మైక్రోసాఫ్ట్' రూ.7 లక్షల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగాలకు ఎంపిక చేసుకోవడం నిజంగా గర్వకారణం.

### యువతకు ఉద్యోగ కల్పన ప్రధాన లక్ష్యం

యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ప్రారంభమైన తొలి ఏడాదిలోనే సుమారు వెయ్యికి పైగా విద్యార్థులు శిక్షణ పొందడం.. నైపుణ్య విద్యపై ప్రభుత్వ సంకల్పానికి నిదర్శనం. భవిష్యత్తులో ఇందులో డిగ్రీ, పీజీ కోర్సులను ప్రవేశపెట్టనున్నారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలో సుమారు 57 ఎకరాల విస్తీర్ణంలో శాశ్వత క్యాంపస్ నిర్మాణం కొనసాగుతోంది. అటు..విద్యార్థుల్లో నైపుణాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని భద్రాద్రి జిల్లా కొత్తగూడెంలోని మైనింగ్ కళాశాలను రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయంగా అభివృద్ధి చేసింది. భూగోళ శాస్త్రం, భూవిజ్ఞాన శాస్త్ర రంగాల్లో సమగ్ర విద్యనందించే దేశంలోని తొలి ప్రత్యేక విశ్వవిద్యాలయంగా ఇది అవతరించింది. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించడం, ఇంటర్న్ షిప్ అవకాశాలను విస్తరించడం, ప్రాంగణ నియామకాలను పెంచడం వంటి లక్ష్యాలతో విశ్వవిద్యాలయాలను సమాయత్తం చేస్తోంది. విద్యాసంస్థలు, పరిశ్రమల అనుసంధానానికి కార్యాచరణ ఇంజినీరింగ్ విద్యాప్రమాణాల పెంపులో భాగంగా వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యావేత్తలు, ఉపకులపతులు, మద్రాసు ఐఐటీ నిపుణులతో గతేడాది వర్క్ షాపు నిర్వహించి, ఇంజినీరింగ్ కోర్సుల సిలబస్‌లో సమూల మార్పుల శ్రీకారం చుట్టింది. సాంకేతిక విద్యను అభ్యసించే డిప్లొమా విద్యార్థులకు ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేందుకు పాలిటెక్నిక్ విద్యలో భారీ మార్పులకూ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మార్కెట్, పారిశ్రామిక అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ అండ్ ఇంజినీరింగ్, సెమికండక్టర్ టెక్నాలజీ లాంటి 12 కొత్త కోర్సులు ఈ విద్యాసంవత్సరం నుంచి విద్యార్థులకు అందుబాటులోకి వచ్చాయి. ఐఐటీ--హైదరాబాద్ నిపుణులు, భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ), టాటా టెక్నాలజీస్ ప్రతినిధుల సహకారంతో విద్యను ఉపాధిని మేళవించేలా కోర్సులు, సిలబస్ రూపకల్పనకు చర్యలు చేపట్టింది.

### ఐటీఐల ఆధునికీకరణ

పదో తరగతి తర్వాత విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చేందుకు పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)ల ఆధునికీకరణకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చింది. టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ సహకారంతో రాష్ట్రంలోని ప్రభుత్వ 65 ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు(ఏటీసీ)లుగా ఆధునీకరించింది. నియోజకవర్గానికి ఒక ఏటీసీ ఉండాలనే భావనతో గ్రామీణ నియోజకవర్గాల్లో కొత్తగా మరో 45 ఏటీసీల ఏర్పాటుకు చర్యలు కొనసాగుతున్నాయి. మరోవైపు, ఉపాధి భాషగా భావించే ఆంగ్లంలో విద్యార్థుల్లో కమ్యూనికేషన్ నైపుణ్యాల పెంపుపైనా ఉన్నత విద్యామండలి ప్రత్యేక చర్యలు చేపట్టింది. డిగ్రీలోని నాలుగు సెమిస్టర్లకు స్కిల్డ్ ఆధారిత కామన్ ఇంగ్లీష్ సిలబస్‌ను రూపొందించింది. ఈ విద్యాసంవత్సరం నుంచి అన్ని విశ్వవిద్యాలయాల పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో ఈ సిలబస్‌ను అమలు చేయనున్నారు. నిజజీవిత పరిస్థితుల్లో ఉపయోగించే ఇంగ్లీష్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ... విద్యార్థుల్లో మాట్లాడడం, రాయడం, చదవడం నైపుణ్యాల పెంపుపై దృష్టి పెట్టారు. ఇదే క్రమంలో ఇక ఇంటర్మీడియట్ ఇంగ్లీష్‌లో కూడా కమ్యూనికేషన్ ల్యాబ్‌లను ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

### పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్య

విశ్వవిద్యాలయం నుంచి సెకండరీ స్థాయి విద్యదాకా విద్యారంగంలో జరుగుతున్న ఈ సంస్కరణలను పరిశీలిస్తే విద్యార్థుల్లో నెపుణ్యాభివృద్ధిపై తెలంగాణ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని అర్థం చేసుకోవచ్చు. ఈ సంస్కరణల అసలు విజయం విద్యార్థులు ఉపాధి పొందే స్థాయిలో కన్పించాల్సి ఉంది. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యను నిరంతరం నవీకరించగలిగితేనే ఈ ప్రయత్నాలు ఫలిస్తాయి. తెలంగాణ విద్యాశాఖను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే స్వయంగా పర్యవేక్షిస్తూ, ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్యాస్థాయి వరకు ఆయన తీసుకుంటున్న సమగ్ర చర్యలు తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టేందుకు దోహదపడుతున్నాయి.

# బోధనకు టీచర్లు కరువు!

'అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని' అనే సామెత నేటి ప్రభుత్వ పాఠశాలల పరిస్థితికి అచ్చం సరిపోతుంది. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం గత కొన్నేళ్లుగా అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోంది. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల వైపు ఆకర్షించేందుకు ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను చైతన్యపరిచే ఈ కార్యక్రమం మంచి ఫలితాలనే ఇస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు పెరుగుతున్నాయి. ప్రైవేటు పాఠశాలల నుంచి కూడా గణనీయమైన సంఖ్యలో విద్యార్థులు ప్రభుత్వ బడుల వైపు అడుగులు వేస్తున్నారు. ఇది ప్రభుత్వ విద్యపై ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనం. అయితే, ఈ విజయానికి సమాంతరంగా మరో తీవ్రమైన సమస్య ప్రభుత్వ విద్యా వ్యవస్థను వెంటాడుతోంది. అదే ఉపాధ్యాయుల కొరత. విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నా, వారికి బోధించేందుకు తగిన సంఖ్యలో ఉపాధ్యాయులు లేకపోవడం ప్రభుత్వ విద్య నాణ్యతను దెబ్బతీస్తోంది. విద్యార్థులను చేర్పించడమే లక్ష్యంగా కార్యక్రమాలు చేపడుతున్న ప్రభుత్వం, వారికి నాణ్యమైన విద్య అందించే ఉపాధ్యాయులను నియమించడంలో మాత్రం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందనే విమర్శలు రోజు–రోజుకూ బలపడుతున్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తోంది. జిల్లాలో ప్రస్తుతం 70 ఉన్నత పాఠశాలలు, 43 ప్రాథమికోన్నత పాఠశాలలు, 81 ప్రాథమిక పాఠశాలలు పనిచేస్తున్నాయి. గత నెల ఒకటో తేదీ నుంచి ప్రారంభమైన బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల ప్రత్యేకతలను వివరిస్తూ విద్యార్థులను చేర్పించారు. ఈ కృషి ఫలితంగా ఇప్పటివరకు జిల్లాలో 1,331 మంది కొత్త విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. వీరిలో చాలామంది ప్రైవేటు పాఠశాలలను వదిలి ప్రభుత్వ పాఠశాలలను ఎంచుకోవడం గమనార్హం. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం ఉచిత పాఠ్యపుస్తకాలు, రెండు జతల యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం, ఈ విద్యా సంవత్సరం నుంచి అల్పాహారం, మెరుగైన తరగతి గదులు, డిజిటల్ బోధన వంటి అనేక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఇవి ఎంతో ఉపశమనం కలిగిస్తున్నాయి. దీంతో తల్లిదండ్రుల్లో ప్రభుత్వ విద్య పట్ల విశ్వాసం పెరుగుతోంది. ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు కూడా ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని పిలుపునివ్వడం విద్యార్థుల చేరికలు పెరగడానికి దోహదపడుతోంది. అయితే, విద్యార్థుల సంఖ్య పెరగడం ఒక్కటే విజయానికి ప్రమాణం కాదు. వారికి నాణ్యమైన బోధన అందించడం, వ్యక్తిత్వ వికాసానికి అవసరమైన విద్యను అందించడం మరింత ముఖ్యమైన బాధ్యత. భూపాలపల్లి జిల్లాలో ప్రస్తుతం 18 వేలకుపైగా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారు. కానీ, ఈ సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేరు. ఫలితంగా ఒకే ఉపాధ్యాయుడు రెండు లేదా మూడు సబ్జెక్టులు బోధించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కొన్ని పాఠశాలల్లో ముఖ్యమైన సబ్జెక్టులకు ఉపాధ్యాయులే లేకపోవడం విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఉపాధ్యాయుల కొరత వల్ల విద్యార్థుల వ్యక్తిగత అభ్యాసంపై శ్రద్ధ తగ్గుతోంది. తరగతిలో ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి పెట్టే అవకాశం ఉండటం లేదు. పరీక్షలకే పరిమితమైన బోధన కొనసాగుతోంది. సృజనాత్మక ఆలోచన, నైపుణ్యాభివృద్ధి, పోటీ పరీక్షలకు అవసరమైన ప్రాథమిక పునాది బలహీనపడుతోంది. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలంటే భౌతిక సదుపాయాల కంటే బోధనా నాణ్యతకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. గత ఏడాది పదో తరగతి పరీక్షల్లో జిల్లా ఉత్తీర్ణత శాతం సంతృప్తికరంగానే ఉన్నప్పటికీ, అత్యుత్తమ ఫలితాలు సాధించడంలో వెనుకబడిందనే అభిప్రాయం ఉంది. మంచి ఉత్తీర్ణత వచ్చినా, రాష్ట్ర స్థాయి ర్యాంకులు లేదా ప్రతిభ కనబరిచే విద్యార్థుల సంఖ్య ఆశించినంతగా లేకపోవడానికి ఉపాధ్యాయుల కొరత కూడా ఒక కారణంగా విద్యావేత్తలు భావిస్తున్నారు. సరిపడా ఉపాధ్యాయులు ఉంటే ఫలితాలు మరింత మెరుగ్గా ఉండేవన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం జిల్లాలో 6 ప్రధానోపాధ్యాయుల పోస్టులు, 75 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు, 10 ఎల్ఎఫ్ఎల్/హెచ్ఎం పోస్టులు, 3 భాషా పండితుల పోస్టులు, 171 ఎస్జీటీ పోస్టులు, ఒక పీఈటీ పోస్టు ఖాళీగా ఉన్నాయి. మొత్తంగా 286 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండటం ఆందోళన కలిగించే అంశం. ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ఈ ఖాళీలను భర్తీ చేయాల్సిన ప్రభుత్వం ఇప్పటికీ నియామకాలపై స్పష్టత ఇవ్వకపోవడం విద్యార్థులు, తల్లిదండ్రుల్లో నిరాశను పెంచుతోంది. ఇంకోవైపు జిల్లాలో 39 ప్రభుత్వ పాఠశాలలు మూతపడడం ప్రభుత్వ విద్య ఎదుర్కొంటున్న సంక్షోభానికి మరో సంకేతం. ఇటీవల రెండు పాఠశాలలు మాత్రమే తిరిగి ప్రారంభమైనప్పటికీ, ఇంకా 37 పాఠశాలలు మూసివేసి ఉన్నాయి. విద్యార్థుల కొరత, ఉపాధ్యాయుల లేమి, ప్రైవేటు విద్యాసంస్థల వైపు తల్లిదండ్రుల మొగ్గు వంటి కారణాలు ఈ పరిస్థితికి దారితీశాయి. ప్రతి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల బలోపేతం కావాలంటే ముందుగా అక్కడ నాణ్యమైన బోధన అందించే ఉపాధ్యాయులు ఉండాలి. ప్రభుత్వం ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను విస్మరించలేం. అల్పాహారం, మధ్యాహ్న భోజనం, ఉచిత పుస్తకాలు, యూనిఫాంలు, మౌలిక వసతుల కల్పన వంటి చర్యలు ప్రశంసనీయమే. అయితే, విద్యా వ్యవస్థలో అత్యంత కీలకమైన అంశం ఉపాధ్యాయుడు. తరగతి గది ఎంత ఆధునికంగా ఉన్నా, డిజిటల్ బోర్డులు ఎంత ఉన్నా, నిబద్ధత కలిగిన ఉపాధ్యాయుడు లేకుంటే విద్యార్థికి నాణ్యమైన విద్య అందదు. అందుకే ఉపాధ్యాయ నియామకాలను ప్రభుత్వం అత్యవసర అంశంగా పరిగణించాలి. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో మళ్లీ విశ్వాసం పెరుగుతోంది. ఈ అవకాశాన్ని ప్రభుత్వం కోల్పోవద్దు. ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేసి, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సబ్జెక్టు వారీగా ఉపాధ్యాయులను నియమిస్తే ప్రభుత్వ విద్య మరింత బలోపేతం అవుతుంది. మూసివేసిన పాఠశాలలను పునరుద్ధరించే అవకాశాలు కూడా మెరుగుపడతాయి. విద్యార్థుల చేరికలు మరింత పెరిగి, ప్రైవేటు విద్యపై ఆధారపడే పరిస్థితి తగ్గుతుంది. ప్రభుత్వ విద్య అనేది కేవలం సంక్షేమ కార్యక్రమాల సమాహారం కాదు; అది సమాజ భవిష్యత్తును తీర్చిదిద్దే అత్యంత కీలకమైన వ్యవస్థ. ఆ వ్యవస్థకు భవనాలు, పుస్తకాలు, భోజనం ఎంత అవసరమో, నిబద్ధతతో పనిచేసే ఉపాధ్యాయులు అంతకంటే ఎక్కువ అవసరం. విద్యార్థుల భవిష్యత్తు ప్రయోగాలకు వేదిక కాకూడదు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి ఉపాధ్యాయ ఖాళీలను అత్యవసరంగా భర్తీ చేసి, ప్రభుత్వ పాఠశాలలను నిజమైన విద్యాలయాలుగా తీర్చిదిద్దాల్సిన సమయం ఆసన్నమైంది. అప్పుడే ప్రభుత్వ విద్యపై ప్రజల విశ్వాసం మరింత బలపడుతుంది. అప్పుడే బడిబాట కార్యక్రమం సంపూర్ణ విజయాన్ని అందుకుంటుంది. అప్పుడే ప్రభుత్వ పాఠశాలలు కేవలం విద్యార్థులతోనే కాదు, నాణ్యమైన విద్యతోనూ కళకళలాడతాయి.

# కేబినెట్‌లో భారీ మార్పులు?





పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఈ నెల 20 నుంచి జరగనున్న నేపథ్యంలో.. అంతకుముందే కేంద్ర కేబినెట్ పునర్వ్యవస్థీకరణ చేపట్టాలని ఎన్డీయే సర్కారు భావిస్తోంది. ఇప్పటికే ఢిల్లీ కేంద్రంగా బీజేపీ అధిష్టానం కీలక భేటీలు నిర్వహించింది. ప్రెసిడెంట్ ద్రౌపది ముర్మును సైతం ఇటీవలే ప్రధాని మోడీ, అమిత్ షా వేరువేరుగా కలిసి కేబినెట్ మార్పులపై చర్చించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మాజీ గవర్నర్, పీఎంకు కీలక సలహాదారుగా ఉన్న శక్తికాంత దాస్‌కు కీలక బాధ్యతలు అందిస్తారని బీజేపీ వర్గాలు చెప్తున్నాయి. పశ్చిమాసియా సంక్షోభం తదితర పరిణామాల నేపథ్యంలో దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు పెట్టుబడిదారుల్లో నమ్మకం పెంచాలనే ఆలోచనతోనే ఆర్థికశాఖను 'దాస్'కు అప్పగించాలని ప్రధాని మోడీ భావిస్తున్నట్టు తెలియజేశాయి. ప్రస్తుత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్థానంలో ఆయనకు ఫైనాన్స్ మినిస్ట్రీ బాధ్యతలు అప్పగిస్తారని ప్రచారం జరుగుతోంది. ఇంతకాలం ఆర్థిక బాధ్యతలు చూసుకున్న నిర్మలకు విద్యాశాఖ అందజేస్తారని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ క్రమంలో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు మరోశాఖ కేటాయించనున్నట్టు తెలుస్తోంది.

### ఆరేళ్లు ఆర్బీఐ గవర్నర్..

ఆరేళ్లు ఆర్బీఐ గవర్నర్‌గా ఉండటంతో పాటు పలు కీలక ఆర్థిక విధానాల రూపకల్పనలో పీఎంవో సభ్యుడిగా శక్తికాంత దాస్‌కు అపార అనుభవం సంపాదించారు. ప్రభుత్వ వర్గాల్లో 'మిస్టర్ డిపెండబుల్'గా పేరొందిన ఆయన.. అంతర్జాతీయ సంక్షోభాలను ఎదుర్కొని భారత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయగలిగే సమర్థుడని ఎన్డీయే సర్కారు భావిస్తోంది. గ్లోబల్ వాణిజ్యంలో ఉన్న సమస్యలు, ట్రంప్ వేస్తున్న సుంకాలతో పాటు ప్రైవేటు రంగంలో పెట్టుబడులు పెరిగేలా చూడటం, ఆర్థిక లోటును పూడ్చటం, గ్లోబల్ షాక్‌ల వల్ల పెరుగుతున్న ద్రవ్యోల్బణానికి కళ్లెం వేయడం తదితర సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ఆర్థికవేత్తగా ఎంతో అనుభవం ఉన్న శక్తికాంత దాస్ సరైన వ్యక్తి అని ప్రధాని మోడీ అనుకుంటున్నారని, అందుకే ఆయన్ను ఎంపిక చేశారని బీజేపీ వర్గాలు అంటున్నాయి.

### కీలక పదవి ఇవ్వడం వెనుక..

శక్తికాంతదాస్‌కు ఈ కీలక పదవి ఇవ్వడం వెనుక ఆయన ట్రాక్ రికార్డు కూడా ప్రధాన కారణమని తెలుస్తోంది. వివిధ స్థాయిల్లో 8 కేంద్ర బడ్జెట్‌లు సిద్ధం చేయడంలో శక్తికాంత దాస్ పాల్గొన్నారు. అలాగే ఆర్బీఐ 25వ గవర్నర్‌గా ఆయన ఉన్నప్పుడే కొవిడ్–19 సంక్షోభం దేశాన్ని అతలాకుతలం చేసింది. అలాంటి కష్టకాలంలో కూడా దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బతినకుండా కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆ సమయంలో ఆయన తీసుకున్న నిర్ణయాలు అంతర్జాతీయంగా కూడా ప్రశంసలు అందుకున్నాయి. ఇక మోడీ సర్కారు ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జీఎస్టీ, ఇన్‌సాల్వెన్సీ అండ్ బాంక్రప్సీ కోడ్ (ఐబీసీ) చట్టాలు తెచ్చిన సమయంలో ఎకనామిక్ అఫైర్స్ సెక్రెటరీగా ఉన్న దాస్.. ఈ విధానాలు స్మూత్‌గా అమలయ్యేలా చూసేందుకు ఎంతో కృషిచేశారు. జీ 20 లో భారత రాయబారిగా కూడా సేవలందించిన ఆయన.. అంతర్జాతీయంగా ఎంతో మెప్పు పొందడంతోపాటు ప్రతిష్టాత్మక 'సెంట్రల్ బ్యాంకర్ ఆఫ్ ది ఇయర్' అవార్డును కూడా పలుమార్లు అందుకున్నారు.

### పీవీ తరహా నిర్ణయం..

1991లో అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు కూడా ఇలాంటి నిర్ణయమే తీసుకున్నారు. ఆనాడు ఆర్థిక పరిస్థితులు ఇబ్బంది కరంగా ఉండటంతో నాటి ఆర్బీఐ గవర్నర్ మన్మోహన్ సింగ్‌ను ఆర్థిక మంత్రిని చేశారు. ఈ సాహసోపేత నిర్ణయంతో దేశ ఆర్థిక వ్యవస్థ ఎంతలా మారిందో అందరికీ తెలిసిందే. అదే ఆలోచనతో మోడీ కూడా శక్తికాంత దాస్‌ను ఎంపిక చేసి దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టే ఆలోచనతో ఉన్నట్లు తెలుస్తోంది. దానికి తోడు నమ్మకస్తులైన బ్యూరోక్రాట్లను మంత్రివర్గంలో తీసుకునే అలవాటు మోడీకి మొదటి నుంచి ఉన్నదే. విదేశాంగ మంత్రి జైశంకర్ అలా వచ్చినవారే. ఇప్పుడు శక్తికాంత దాస్‌ను కూడా ఈ తరహాలోనే తన కేబినెట్‌లో చేర్చుకుంటారని సమాచారం. యూపీ నుంచి ఆయనను రాజ్యసభకు నామినేట్ చేసి, ఆ తర్వాత ఆర్థిక మంత్రిగా బాధ్యతలు అప్పగించాలని బీజేపీ నాయకత్వం వ్యూహరచన చేస్తోంది.

సంపదకియం పేజీలో రచనలు పంపవలసిన వాట్సాప్ నంబర్ మెయిల్ ఐడి 9951512539
flashindia999@gmail.com

# భారీగా తగ్గిన కార్మికుల సంఖ్య

## లక్ష నుంచి 40 వేలకు పరిమితం..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కార్మిక శక్తికి, హక్కుల పోరాటాలకు కేరాఫ్ అడ్రస్ అయిన సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్సీసీఎల్)లో ఇప్పుడు నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. ఒకప్పుడు వేలమంది కార్మికుల కోలాహలంతో, నిరంతరం రణగొణ ధ్వనులతో మార్మోగే గనులు ఇప్పుడు యంత్రాల మయం అవుతున్నాయి. బొగ్గు ఉత్పత్తి ఏటికేడూ రికార్డు స్థాయిలో పెరుగుతున్నప్పటికీ, ఆ బొగ్గును వెలికితీసే కార్మికుల సంఖ్య మాత్రం దారుణంగా పడిపోతోందని సంస్థ అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. లాభాల వేటలో యాంత్రీకరణకు పెద్దపీట వేస్తున్న యాజమాన్యం మానవ వనరుల పట్ల మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రిటైర్మెంట్ల పేరుతో వెళ్తున్న వారి స్థానంలో కొత్త నియామకాలు చేపట్టకపోవడం వల్ల సింగరేణి గనుల్లో వారసత్వ ఉద్యోగాల ఆశలు అడుగంటుతున్నాయి.

**లక్ష నుంచి 40 వేలకు పరిమితం..**

సింగరేణిలో ఒకప్పుడు లక్షకు పైగా ఉన్న కార్మిక శక్తి కాలక్రమేణా సగానికి పైగా హరించుకుపోయింది. ఏప్రిల్ 2000 నాటికి సంస్థలో మొత్తం 1,05,627 మంది ఉద్యోగులు, కార్మికులు ఉండగా, గత మే 2026 నాటికి ఆ సంఖ్య కేవలం 40,136 కి పరిమితమైంది. అంటే గత 26 ఏళ్లలో దాదాపు 65 వేల మందికి పైగా సిబ్బంది తగ్గడం గమనార్హం. ప్రస్తుతం అధికారుల సంఖ్య 2,339 గా ఉండగా, నేషనల్ కోల్ వేజ్ అగ్రిమెంట్ (ఎన్సీడబ్ల్యూఏ) కిందికి వచ్చే కార్మికుల సంఖ్య 37,797కి పడిపోయింది. రిటైర్మెంట్ ఎక్కువగా ఉండటం, కొత్త నియామకాలు ఆశించిన స్థాయిలో లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణమని సంస్థ చెబుతున్నా, ఇది పక్కా ప్రణాళికాబద్ధమైన కుదింపు అని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి.

**భూగర్భ గనుల సంఖ్య కుదింపు..**

సింగరేణిలో మానవ వనరులు తగ్గిపోవడానికి ప్రధాన కారణం కార్మికులు ఎక్కువగా అవసరమయ్యే భూగర్భ (యూజీ) గనులు వేగంగా మూతపడటమేనని సింగరేణి వర్గాలు చెబుతున్నాయి. 2015లో సంస్థ పరిధిలో మొత్తం 48 గనులు (32 భూగర్భ, 16 ఓపెన్ కాస్ట్) ఉండగా, 2026 నాటికి మొత్తం గనుల సంఖ్య 37 కు పడిపోయింది. ప్రస్తుతం ఇందులో 21 భూగర్భ గనులు, 16 ఓపెన్ కాస్ట్ గనులు మాత్రమే నడుస్తున్నాయి. అంటే పదేళ్లలోనే 11 భూగర్భ గనులు మూతపడ్డాయి. ఓపెన్ కాస్ట్ (ఓసీ) గనుల్లో మానవ శ్రమ తక్కువ, భారీ యంత్రాల వాడకం ఎక్కువ కావడంతో మేనేజ్‌మెంట్ కొత్త నియామకాలు చేపట్టకుండా కార్మిక సంఖ్యను తగ్గించేస్తోంది. ఫలితంగా ఉత్పత్తి పెరుగుతున్నా స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు మాత్రం పూర్తిగా సన్నగిల్లుతున్నాయి.

# పాలమూరుపై సీఎం ఫోకస్

**మహబూబ్‌నగర్,ఫ్లాష్ ఇండియా :** ఉమ్మడి పాలమూరు జిల్లాలో సాధించిన తిరుగులేని రాజకీయ ఆధిపత్యాన్ని ఏమాత్రం సడలకుండా చూసుకునేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో అధికార కాంగ్రెస్ పార్టీ ఇప్పటి నుంచే పక్కా వ్యూహంతో ముందుకు సాగుతోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా రెండేళ్లకు పైగా సమయం ఉన్నప్పటికీ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో గులాబీ కోటలో 'చేయి' పట్టు మరింత బిగుసుకుంటోంది. గత ఎన్నికల్లో జిల్లాలోని 14 స్థానాలకు గాను ఏకంగా 12 సీట్లు గెలుచుకున్న హస్తం పార్టీ.. గద్వాల ఎమ్మెల్యే చేరికతో ఆ సంఖ్యను 13కు పెంచుకుని తిరుగులేని శక్తినని నిరూపించుకుంది. అయితే, జిల్లా బిడ్డ ముఖ్యమంత్రి అయినా ప్రాజెక్టుల పనులు ఆశించిన స్థాయిలో సాగకపోవడంపై తలెత్తుతున్న అసంతృప్తిని ముందే పసిగట్టిన అధికార పార్టీ మంత్రులు.. ఎమ్మెల్యేలు సీఎం రేవంత్ రెడ్డిని ఆహ్వానించి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప చేస్తున్నారు.

**సీఎం రెండు రోజుల పర్యటనతో..**

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దశాబ్దాలుగా నలుగుతున్న పెండింగ్ ప్రాజెక్టుల సమస్యను అస్త్రంగా చేసుకుని బీఆర్ఎస్, ప్రజాసంఘాలు ఉద్యమబాట పట్టేందుకు సిద్ధమవుతున్న తరుణంలో సీఎం రేవంత్ రెడ్డి వ్యూహాత్మకంగా వ్యవహరించారు. గత నెలలోనే రెండు రోజుల పాటు జిల్లాలో సుడిగాలి



**గులాబీ బాస్‌లపైనే నేరుగా దాడి..**

స్థానిక బీఆర్ఎస్ నేతలను పెద్దగా పట్టించుకోకుండా నేరుగా కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులనే టార్గెట్ చేస్తూ రేవంత్ రెడ్డి విమర్శల పదును పెంచారు. 2024లో మొదలైన మా పాలన 2034 దాకా సాగుతుంది.. బీఆర్ఎస్‌ను జనం ఎప్పుడో బొంద పెట్టారు, కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితం అంటూ క్యాడర్‌లో జోష్ నింపుతున్నారు. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో ప్రతిపక్షానికి ఒక్క సీటు కూడా దక్కనివ్వనని సవాల్ విసరడం ద్వారా విపక్షాల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారు.

పర్యటనలు చేసి, క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించారు. వచ్చే డిసెంబర్ నాటికి పెండింగ్ పనులన్నింటినీ పూర్తి చేయడంతో పాటు.. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా కనీసం కరివేనా రిజర్వాయర్ వరకు సాగునీరు తెచ్చి తీరుతామని ప్రజలకు గట్టి నమ్మకం కలిగించారు.

**సెంటిమెంట్‌తో వ్యాఖ్యానాలు..**

రాజకీయ విమర్శలతో పాటు సెంటిమెంట్‌ను కూడా సీఎం రేవంత్ సమాంతరంగా వాడుకుంటున్నారు. మిడ్జిల్ ప్రజలు నాటిన చిన్న మొక్క ఇవాళ మహావృక్షమై రాష్ట్రానికి ముఖ్యమంత్రిని చేసింది.. ఈ ప్రాంతాన్ని ఇప్పుడే అభివృద్ధి చేసుకోకపోతే ఇంకెప్పుడు చేసుకుంటాం? అంటూ సెంటిమెంట్ అస్త్రాన్ని ప్రయోగించారు. ముఖ్యంగా మహిళా ఓటర్లను ఆకట్టుకునేలా సాగుతున్న సీఎం ప్రసంగాలు జిల్లా రాజకీయాన్ని వేడెక్కిసస్తున్నాయి. విపక్షాల వ్యూహాలకు ముందే ప్రతివ్యూహాలతో చెక్ పెడుతూ.. పాలమూరు గడ్డపై కాంగ్రెస్ పట్టు సడలకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో పార్టీ వర్గాలు వ్యూహరచనలు చేసుకొని ముందుకు సాగుతున్నట్లు సమాచారం.

# నరసింహారెడ్డి మృతికి సీఎం సంతాపం



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** భువనగిరి మాజీ ఎమ్మెల్యే కొమ్మిడి నరసింహారెడ్డి (కొమ్మిడి నర్సన్న) ఈ రోజు తెల్లవారుజామున వృద్ధాప్య కారణాలతో కన్నుమూశారు. ఆయన మృతి పట్ల తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. 1969 తొలి దశ తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న నర్సింహారెడ్డి.. తన తుదిశ్వాస వరకు నీతి నిజాయితీలతో జీవించారని సీఎం కొనియాడారు. గోదావరి జలాల సాధన కోసం, అలాగే మూసీ నది పరిరక్షణ కోసం ఆయన సాగించిన ఉద్యమాలను గుర్తుచేస్తూ.. నిత్యం ప్రజల పక్షాన నిలిచిన గొప్ప ప్రజా సేవకుడు రాష్ట్రం కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

**భూదానోద్యమానికి 300 ఎకరాల భూమి దానం..**

ఆనాడు వినోబా భావే నేతృత్వంలో సాగిన భూదానోద్యమానికి స్ఫూర్తి పొంది, పేదల కోసం తన సొంత 300 ఎకరాల భూమిని దానం చేసిన అరుదైన, గొప్ప మానవతావాది కొమ్మిడి నర్సన్న అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్మరించుకున్నారు. 1978, 1983 సంవత్సరాలలో రెండు పర్యాయాలు భువనగిరి నియోజకవర్గం నుంచి శాసనసభకు ప్రాతినిధ్యం వహించిన ఆయన.. పదవుల్లో ఉన్నా, లేకున్నా అత్యంత నిరాడంబర జీవితాన్ని గడిపారని తెలిపారు. అనునిత్యం ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేసిన నర్సింహారెడ్డి జీవితం నేటి తరం రాజకీయ నాయకులకు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. భగవంతుడు వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# జీతాలు ఎందుకు పడలేదు?

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** జులై 1న సగం మంది కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మాత్రమే జీతాలు చెల్లించడంపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆలస్యానికి కారణమైన వివిధ శాఖల సెక్రెటరీలు, హెచ్‌ఓడీలకు మెమోలు ఇవ్వాలని సీఎస్‌ను ఆదేశించినట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. సకాలంలో బిల్లులు సమర్పించని కారణంగానే ఉద్యోగులకు జీతాలు వేయలేదని ఆర్థిక శాఖ వర్గాలు సీఎంఓకు వివరణ ఇచ్చినట్లు సమాచారం. ఆలస్యంగా బిల్లులు సమర్పించిన శాఖల వివరాలను సీఎంకు అందించినట్టు తెలిసింది. త్వరలో జరిగే సమీక్షా సమావేశంలో జీతాల చెల్లింపుపై సీఎం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చే అవకాశం ఉంది.

**చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశం**

జీతాల చెల్లింపుల్లో ఆలస్యం జరిగిన విషయాన్ని గుర్తించిన సీఎం రేవంత్ రెడ్డి సోమవారం కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అంశంపై సమీక్ష జరిపేందుకు సిద్ధమయ్యారు. కానీ ఇతర పనులు ఉండటంతో అది కాస్త వాయిదా పడింది. అంతకుముందు సీఎంఓ అధికారులతో జీతాల చెల్లింపు ఆలస్యం అంశం చర్చకు వచ్చిన సమయంలో సీఎం తీవ్రంగా స్పందించినట్టు తెలిసింది.' ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు ప్రతినెలా ఒకటిన ఇవ్వాలి. నిధుల కొరత లేదు. అయినా ఎందుకు జీతాలు ఇవ్వలేదు' అని సీఎం ప్రశ్నించగా.. నిర్ణీత సమయంలో బిల్లులు సమర్పించని కారణంగానే సగం మందికి మాత్రమే జీతాలు చెల్లించినట్టు అధికారులు వివరణ ఇచ్చినట్లు తెలిసింది. దీనితో సీరియస్ అయిన సీఎం నిర్ణీత సమయంలో బిల్లులు సమర్పించని సెక్రెటరీలు, హెచ్‌ఓడీలను గుర్తించి వారికి మెమోలు ఇవ్వాలని సీఎస్‌ను ఆదేశించినట్టు తెలిసింది. వెంటనే రంగంలోకి దిగిన సీఎంఓ ఏశాఖ ఏరోజు శాలరీ బిల్స్‌ను ఆర్థికశాఖకు సమర్పించింది? సకాలంలో ఏ ఏ శాఖలు సమర్పించలేదు? అందుకు గల కారణాలు ఏంటీ? అనే అంశాలపై ఆరా తీస్తున్నట్టు తెలిసింది.

**సీరియస్‌గా తీసుకోని అధికారులు**

జులై ఒకటి నుంచి రెగ్యులర్ ఉద్యోగుల తరహాలోనే ప్రతినెలా ఒకటో తేదీన కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్‌కు జీతాలు చెల్లించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. దీంతో జూన్ జీతాల బిల్లులను జూన్ 25 లోపు తమకు పంపాలంటూ ఆర్థికశాఖ అన్ని శాఖలకు సర్క్యులర్ జారీ చేసింది. కానీ, కొన్ని శాఖలు మాత్రమే నిర్ణీత సమయంలో జీతాలకు సంబంధించిన బిల్లులను ఆర్థిక శాఖకు పంపాయి. దీంతో దాదాపు 5 లక్షల మంది కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ లో కేవలం 2.70 లక్షల మందికి మాత్రమే ఈ నెల ఒకటిన జీతాలు అందాయి.

**నిర్లక్ష్యంలో సెక్రెటరీలు, హెచ్‌ఓడీలు**

ప్రతినెలా ఒకటిన ఉద్యోగులకు జీతాలు ఇవ్వాలంటే 5 రోజుల ముందుగా జీతాల బిల్లులను ఆర్థిక శాఖకు పంపాలి. కానీ మెజారిటీ సెక్రెటరీలు,హెచ్‌ఓడీలు తమ శాఖల పరిధిలోని సంస్థలకు బిల్లులను సమర్పించే డెడ్‌లైన్
వివరాలను పంపలేదు. దీంతో సగం మందికి మాత్రమే జీతాలు సకాలంలో చెల్లించారు. మిగతా సగం మంది జీతాల బిల్లులను ఆర్థిక శాఖకు పంపలేదు. ఇప్పటివరకు కొన్ని శాఖలు తమ పరిధిలో పనిచేస్తున్న ఎంప్లాయీస్ బిల్లులను ఆర్థిక శాఖకు సమర్పించలేదు.

# వరంగల్ మేయర్ పీఠమే లక్ష్యం..

**వరంగల్,ఫ్లాష్ ఇండియా :** గ్రేటర్ వరంగల్ రాజకీయం రాష్ట్ర రాజధాని వేదికగా కొనసాగుతుంది. గ్రేటర్ పరిధిలో త్వరలో జరిగే ఎన్నికలే లక్ష్యంగా సీనియర్ నేతలు కదులుతున్నారు. రాష్ట్రస్థాయి నామినేటెడ్ పోస్టులకంటే మేయర్ పీఠం వైపే మొగ్గు చూపుతున్నారు. తమకు దగ్గరగా ఉన్న నేతల ద్వారా గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. వరంగల్ నగర మేయర్ స్థానం ఈసారి జనరల్ కు రిజర్వు అయ్యింది. కొన్నేళ్లుగా అవకాశం ఎవరికి రాలేదు. ఈ దఫా జనరల్ నుంచి పోటీ చేసేందుకు ఎక్కువ మంది నేతలు మొగ్గు చూపుతున్నారు. మేయర్ పీఠంకు పోటీగా ఉండటంతో పాటు ముందే ప్రకటన చేయించి పోటీలోకి దిగేందుకు సిద్ధమవుతున్నారు. వరంగల్ నగరం నాలుగు నియోజకవర్గాల పరిధిలో విస్తరించి ఉంది. గ్రేటర్ పరిధిలో ఉన్న అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ఉన్నారు. ఒకరు మంత్రిగా కొనసాగుతుండగా, ముగ్గురు ఎమ్మెల్యేలుగా ఉన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేతలు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవుల కోసం ఎదురు చూస్తున్నారు. రెండవ దఫా పదవుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులు మొదటి విడత నేటితో పూర్తవుతున్నాయి. వీరిలో కొద్దిమందికి రెండవ విడతకు అవకాశం ఇవ్వనున్నారు.

**ఇప్పటి వరకు రెండవ విడతలో...**

ఉమ్మడి జిల్లా నుంచి రాజయ్య, జంగా రాఘవరెడ్డి, రియాజ్, మాజీ ఎమ్మెల్యే పోదెం వీరయ్య, బెల్లయ్య నాయక్, అయిత ప్రకాష్ రెడ్డి ఉన్నారు. వీరిలో రాజయ్యకు ఇప్పటికే రెండవ విడత రెన్యూవల్ చేశారు. మిగతా ఐదుగురిలో ఒక్కరు లేదా ఇద్దరికి అవకాశం ఇచ్చి మిగతా వారికి ఛాన్స్ మిస్ కానున్నట్లు తెలుస్తుంది. గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్




పాలకవర్గం పదవీకాలం ముగిసి రెండు నెలలు దాటింది. ఎన్నికల కమిషన్ ఓటరు జాబితా ప్రకటించగానే డిసెంబర్ లోపు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇప్పటి వరకు రెండవ విడతలో నామినేటెడ్ పదవుల కోసం ప్రయత్నాలు చేసిన కొంత మంది నేతలు మేయర్ పీఠంపై కన్నేశారు. సుమారు 30 ఏళ్లకు పైగా పార్టీలో కీలకంగా పనిచేసిన నేతలు ఈ దఫా తమకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. జనరల్ గా రిజర్వు కావడంతో ఎవరికి వారే రాష్ట్ర
స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ తో పాటు మంత్రులను కలుస్తున్నారు. తమకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. రాష్ట్రస్థాయి కార్పొరేషన్ కన్న మేయర్ గా అవకాశం ఇస్తే పూర్తి స్థాయిలో పనిచే
స్తామని వివరిస్తున్నారు.

**జనరల్ సీటు రావడంతో..**

ఎమ్మెల్యేలు కూడా తమ వారసులను రంగంలోకి దించారు. కార్పొరేషన్ పరిధిలోని డివిజన్ లో పర్యటిస్తూ ప్రజల మద్దతును కూడగట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ కీలకమైనది. దీని పరిధిలో మేయర్ గెలిస్తే వచ్చే ఎన్నికల్లో పార్టీ మరింత బలోపేతం అవుతుందని కాంగ్రెస్ పార్టీ నేతలు దృష్టి పెట్టారు. రాష్ట్రస్థాయి నేతలు, మంత్రులు నగరానికి వచ్చి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. బీఆర్ఎస్, బీజేపీ పూర్తిస్థాయిలో నజర్ పెట్టడంతో ఈసారి ఎలాగైనా మేయర్ పీఠాన్ని చేజిక్కించుకునేందుకు కాంగ్రెస్ నేతలు పావులు కదుపుతున్నారు. జనరల్ సీటు రావడంతో మేయర్ పీఠమే లక్ష్యంగా రాజకీయ కార్యకలాపాలు చేపడుతున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో కీలకమైన ఈ మేయర్ పీఠంపై కాంగ్రెస్ అధిష్టానం తీసుకునే నిర్ణయానికి అనుగుణంగానే ఎంపిక ఉండనుండటంతో నేతలు ప్రయత్నాలు చేసస్తున్నారు. మేయర్ నాలుగు నియోజకవర్గాల పరిధిలో ఉండటం, కోట్ల రూపాయల నిధులు ఉండటం, పనిచేసే అవకాశం ఉండటంతో పోటీ పెరుగుతుంది. కార్పొరేషన్ పరిధిలోని 66 డివిజన్లలో పట్టు ఉంటే భవిష్యత్ రాజకీయాలకు పనికి వస్తుందని నేతలు ప్రయత్నం చేస్తున్నారు. కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయంతో పాటు ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు తీసుకునే నిర్ణయానికి అనుగుణంగానే ఎంపిక జరిగే అవకాశం ఉంది.

# 'సదరం' సర్టిఫికెట్లలో గోల్‌మాల్?

**వరంగల్,ఫ్లాష్ ఇండియా :** వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో దివ్యాంగుల సర్టిఫికెట్ల జారీలో భారీ అక్రమాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. డబ్బులు ఉంటేనే సర్టిఫికెట్.. లేదంటే నిరీక్షణ తప్పదన్నట్లు ఉద్యోగులు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎంజీఎం ఆస్పత్రిలో కొందరు ఉద్యోగులు బ్రోకర్లతో చేతులు కలపడంవల్ల ఈ దుస్థితి దాపు రించిందని వాపోతున్నారు.

**రూ.10 వేల వసూలు**

నిజమైన అంగవైకల్యం కలవారి నుంచి కూడా చిన్న చిన్న సాకులతో రూ.10వేలు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ముడుపులిస్తే అంగవైకల్యం లేని వారికి కూడా సర్టిఫికెట్లు ఇస్తున్నట్లు నిజమైన లబ్ధిదారులు వాపోతున్నారు. ఇలాంటి వారి నుంచి డబ్బులు స్వీకరించిన సిబ్బంది క్షణాల్లో సర్టిఫికెట్లు అందజేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. డీఆర్‌డీఏ ఉద్యోగుల పెత్తనం సదరం సర్టిఫికెట్ల విషయంలో డీఆర్‌డీఏ కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పెత్తనం ఎక్కువైందని ఎంజీఎం అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
వినికిడి యంత్రం ఎంజీఎం పరిధిలో ఉన్నా వారు తమ దగ్గర పెట్టుకొని తప్పుడు సమాచారం దివ్యాంగులకు చేరవేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డీఆర్‌డీఏలో ఓ మహిళా ఉద్యోగి వికలాంగులకు తప్పుడు సమాచారం ఇస్తోందని ఎంజీఎం ఉన్నతాధికారులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. సర్టిఫికెట్ల జారీ వ్యవహారంలో వికలాంగుల జిల్లా సమాఖ్యకు ప్రాతినిధ్యం కల్పిస్తే అవినీతిని అంతం చేయవ చ్చనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.




మాదే వినికిడి యంత్రం డాక్టర్ రామ్‌కుమార్‌రెడ్డి, ఎంజీఎం సూపరింటెండెంట్

వినికిడి పరీక్షలను నిర్ధారించేందుకు ఉపయోగించే యంత్రం తమ ఆధీనంలో ఉంచాల్సిందే. ఇప్పటికే ఈఎన్‌టీ విభాగానికి ఈ యంత్రం విషయంలో స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. ఈ యంత్రాన్ని ఈఎన్‌టీ వైద్యులు మాత్రమే ఉపయోగించి నివేదిక సమర్పించాలి.

# భువనగిరి మాజీ ఎమ్మెల్యే కన్నుమూత..

**భువనగిరి,ఫ్లాష్ ఇండియా :** భువనగిరి మాజీ ఎమ్మెల్యే కొమ్మిడి నర్సింహారెడ్డి కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఈరోజు తుదిశ్వాస విడిచారు. అనారోగ్యం కారణంగా గత 20 రోజుల నుంచి నిమ్స్ ఆస్పత్రిలో ఆయన చికిత్స పొందుతున్నారు. మాజీ ఎమ్మెల్యే నర్సింహారెడ్డి మరణవార్తతో కుటుంబ సభ్యులు, అనుచరులు, పార్టీ శ్రేణులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.కొమ్మిడి నర్సింహారెడ్డి భువనగిరి నియోజకవర్గం నుంచి 1978, 1983లో కాంగ్రెస్ పార్టీ తరఫున రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. రాజకీయ జీవితంలో భువనగిరి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తూ ప్రజాసేవలో ప్రత్యేక గుర్తింపు పొందారు. ప్రజలతో సన్నిహితంగా ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేసిన నాయకుడిగా ఆయనకు పేరు ఉంది. రెండుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసినప్పటికీ.. సొంత ఇల్లు, కారు లేకుండా అద్దె ఇంట్లో జీవించారు. భూదానోద్యమానికి తన 300 ఎకరాల భూమిని దానం చేసి.. 'భూదానశీలి'గా, ఎలాంటి అవినీతి ఆశించని నిజాయితీపరుడిగా ప్రజల మన్ననలు పొందారు.మాజీ ఎమ్మెల్యే కొమ్మిడి నర్సింహారెడ్డి పార్థివ దేహాన్ని ప్రజల సందర్శనార్థం హైదరాబాద్‌లోని రామంతాపూర్‌లో ఉన్న ఆయన పెద్ద కుమార్తె నివాసంలో ఉంచారు. పలువురు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు, కార్యకర్తలు అక్కడికి చేరుకుని నర్సింహారెడ్డికి నివాళులర్పిస్తున్నారు. నర్సింహారెడ్డి అంత్యక్రియలు రేపు యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో నిర్వహించనున్నారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, అభిమానుల సమక్షంలో ప్రభుత్వ లాంఛనాలు లేకుండా అంత్యక్రియలు జరగనున్నట్లు సమాచారం. నర్సింహారెడ్డి మృతికి వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

# మహిళ ఇంట్లోకి నగ్నంగా చొరబడ్డ కౌన్సిలర్




**చాగల్లు,ఫ్లాష్ ఇండియా :** ప్రజాప్రతినిధి హోదాలో ఉండి సమాజానికి ఆదర్శంగా నిలవాల్సిన ఒక కౌన్సిలర్ అర్ధరాత్రి వేళ కామాంధుడిలా మారి అత్యంత నీచమైన చర్యకు ఒడిగట్టాడు. జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలం చాగల్లు గ్రామంలో (మున్సిపాలిటీ పరిధిలో) ఈ ఘోర ఉదంతం వెలుగుచూసింది. వార్డు కౌన్సిలర్ అర్ధరాత్రి వేళ ఒక వృద్ధురాలి ఇంట్లోకి నగ్నంగా చొరబడటమే కాకుండా, ఆమెపై అత్యాచారయత్నానికి పాల్పడటం స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది.

**బాత్రూమ్‌లో బంధించి పోలీసులకు అప్పగింత..**

బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చాగల్లు పరిధిలోని 9వ వార్డు కౌన్సిలర్ సంపత్ రాజ్ అర్ధరాత్రి సమయంలో మద్యం మత్తులో ఒంటిపై నూలుపోగు లేకుండా (నగ్నంగా) స్థానికంగా ఉండే ఒక వృద్ధురాలి ఇంట్లోకి చొరబడ్డాడు. నిద్రిస్తున్న ఆమెపై పడి అత్యాచారానికి ప్రయత్నించగా.. భయాందోళనకు గురైన ఆ వృద్ధురాలు గట్టిగా కేకలు వేసింది. ఆమె కేకలు విన్న చుట్టుపక్కల వారు, కుటుంబ సభ్యులు ఒక్కసారిగా అక్కడికి చేరుకున్నారు. అందరినీ చూసి భయపడిన కౌన్సిలర్ సంపత్ రాజ్ నగ్నంగానే పక్కనే ఉన్న బాత్రూమ్‌లోకి పారిపోయి తలుపు పెట్టుకున్నాడు. వెంటనే సమయస్ఫూర్తితో వ్యవహరించిన స్థానికులు బాత్రూమ్‌కు బయట వైపు గడియపెట్టి (తాళం వేసి) స్టేషన్ ఘన్‌పూర్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. కాగా ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## భూములను తిరిగి ఇవ్వాలని రైతుల ధర్నా

**ఆసిఫాబాద్,ఫ్లాష్ ఇండియా :** అటవీ భూముల పేరుతో ఫారెస్ట్ అధికారులు స్వాధీనం చేసుకున్న రైతుల సాగు భూములను తిరిగి అప్పగించాలని డిమాండ్ చేస్తూ సుర్దాపూర్ గ్రామ రైతులు మంగళవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ఎమ్మెల్యే కోవలక్ష్మి మద్దతు తెలుపుతూ రైతులతో కలిసి ధర్నాలో పాల్గొన్నారు. అనంతరం రైతులతో కలిసి కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ఎమ్మెల్యే ప్రయత్నించగా, పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో కొంతసేపు కలెక్టరేట్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవలక్ష్మి మాట్లాడుతూ రైతులు దశాబ్దాలుగా సాగుచేస్తున్న భూములను అటవీ భూముల పేరుతో ఫారెస్ట్ అధికారులు స్వాధీనం చేసుకోవడం తీవ్ర అన్యాయమని మండిపడ్డారు. గత 40 నుంచి 50 సంవత్సరాలుగా రైతులు ఈ భూములను సాగు చేసుకుంటున్నారని, ఇన్నేళ్లు గుర్తుకు రాని అటవీ భూములు ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన సమయంలోనే అధికారులకు ఎలా గుర్తుకు వస్తాయని ప్రశ్నించారు. ఎండాకాలంలో అధికారులు ఏం చేశారని నిలదీశారు. ఫారెస్ట్ అధికారుల పనితీరు పై ఆమె తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నడూ లేనివిధంగా పోడు రైతులను తీవ్ర వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. రైతుల సమస్యలను డీఎఫ్‌వో, పీసీసీఎఫ్ దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని విమర్శించారు. ప్రస్తుతం రైతులు ఇప్పటికే పొలాల్లో విత్తనాలు వేసినందున, ఈ ఏడాది పంట సాగు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. వచ్చే ఏడాది భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం రెవెన్యూ, ఫారెస్ట్ శాఖల సంయుక్త సర్వే నిర్వహించాలని సూచించారు. ఈ విషయం పై రాష్ట్రప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే కోవలక్ష్మి రైతులతో కలిసి డీఎఫ్‌వో కార్యాలయాన్ని ముట్టడించారు. రైతులకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని ఆమె హెచ్చరించారు.

# ఇద్దరు విద్యా వాలంటీర్లకు వేతనాలను అందిజేత

**ఐఐఐటి బాసరలో సీటు సాధించిన జడ్.పి.హెచ్.ఎస్ మేడిపల్లి విద్యార్థినిని సన్మానించిన మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి**




**మేడిపల్లి,ఫ్లాష్ఇండియా ప్రతినిధి :** జెడ్పీహెచ్ఎస్ జడ్.పి. హెచ్.ఎస్ మేడిపల్లిని సందర్శించి, ఐఐఐటి బాసరలో సీటు సాధించిన విద్యార్థిని ఎం. చందనను సన్మానించారు. ఆమెకు ట్రంక్ బాక్స్, పరుపు తదితర అవసరమైన సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎల్. సత్యప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న దొంతిరి హరిశంకర్ రెడ్డి ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయ బృందం విద్యార్థుల విజయాల కోసం చేస్తున్న కృషిని అభినందించారు. అలాగే పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు విద్యా వాలంటీర్లకు వేతనాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎల్. సత్యప్రసాద్, పాఠశాల విద్యార్థులు మరియు సిబ్బంది తరఫున దొంతిరి హరిశంకర్ రెడ్డి కి వారి ఉదార సహకారం, విద్యాపట్ల చూపుతున్న ఆదరణకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మిర్యాలగూడ పట్టణంలోని ఆర్డీవో ఆఫీస్ దగ్గర ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలుమరియు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షులు ఉబ్బపల్లి రాజ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీనియర్ ఎమ్మార్పీఎస్ పొలిట్ బ్యూరో సభ్యులు దైద సత్యం మాదిగ ముఖ్య అతిథులుగా పాల్గొని జెండా ఆవిష్కరణ చేసి మిఠాయిలు పంచడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ భారతదేశ చరిత్రలోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మందకృష్ణ 32 సంవత్సరాలుగా సుదీర్ఘ పోరాటం ఎస్సీ వర్గీకరణ సాధించి మాదిగ మాదిగ ఉపకులాలకు విద్యా ఉద్యోగ అవకాశాలు అందే విధంగా భవిష్యత్తు తరాలకు భవిష్యత్తు తరాల ఎదుగుదలకు కృషి చేశారు. ఉద్యమం చేస్తూనే ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల కొరకు సమాజంలో అనేక ఉద్యమాలు చేసి వికలాంగులకు వృద్ధులకు వితంతువులకు పింఛన్లు మరియు ఆరోగ్యశ్రీ సేవలను అందించిన ఘనత మందకృష్ణ ది,అదేవిధంగా మాదిగ మాదిగ ఉపకులాల విద్యార్థులు కష్టపడి చదువుకొని ఎస్సీ వర్గీకరణ ఫలాలలో అనుభవిస్తూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిగమించాలని కోరుకుంటున్నాం అన్నారు. అనంతరం సుందర్ నగర్ ప్రాథమిక పాఠశాల నందు కేక్ కటింగ్ చేసి విద్యార్థులకు బిస్కెట్ ప్యాకెట్స్ పంచడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో విహెచ్పిఎస్ నాయకులుఅహ్మద్ ఖాన్,ఎల్తూరి అఖిల్,రేగురి ప్రతాప్, కౌన్సిలర్ పెద్ది శ్రీనివాస్ గౌడ్,మాజీ కౌన్సిలర్ దైద వెంకటేష్,ఉబ్బ పల్లి ఎల్లయ్య,దైద సైదులు,దళిత మోర్చ నాయకులు ఎడ్ల రమేష్,శ్యామ్,మైనార్టీ నాయకులు కాజా,జొన్నపాల శ్రీనివాస్.దైద కిరణ్,ఉబ్బపల్లి శంకర్,దైదశ్రీకాంత్,వెంకటేష్,కృష్ణ,కేసరపు శంకర్,సాయినాథ్,చిన్నకోటి,మాలిక్ తదితరులు పాల్గొన్నారు.



## మంత్రి పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే కఠిన చర్యలు తప్పవు

**చెన్నూర్,ఫ్లాష్ ఇండియా :** మంత్రి వివేక్ వెంకటస్వామి పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని, టీఆర్ఎస్ పార్టీ పాలనలో నిజాం నిరంకుశ పాలన కొనసాగిందని పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు విమర్శించారు. మంగళవారం మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పట్టణ కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు. అధికారం కోల్పోయిన టీఆర్ఎస్ నాయకులు మతిస్థిమితం కోల్పోయి మంత్రిపై నిరాధార విమర్శలు చేస్తున్నారని, వారికి తగిన సమయంలో ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. మాజీ జిల్లా ప్రజాపరిషత్ వైస్ చైర్మన్ మూలరాజిరెడ్డి అవినీతి, అక్రమాలు, ఇసుక దందాలకు పాల్పడుతున్న నేపథ్యంలో మంత్రి వివేక్ వెంకటస్వామి ఆయనను పక్కన పెట్టారని తెలిపారు. దానిని జీర్ణించుకోలేక మూలరాజిరెడ్డి కాంగ్రెస్ నాయకులను "బొంద పెడతాం" అని హెచ్చరించడం ఆయన రౌడీయిజానికి నిదర్శనమని విమర్శించారు. మూలరాజిరెడ్డి చరిత్ర ప్రజలందరికీ తెలుసునని, మొన్నటి వరకు కాంగ్రెస్ పార్టీలో ఉండి మంత్రి వద్ద తన ఆధిపత్యం, రౌడీయిజం చెల్లకపోవడంతో టీఆర్ఎస్ పార్టీలో చేరిన విషయం ప్రజలకు విదితమేనని పేర్కొన్నారు. మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు కారం మాత్రమే ఉన్న భోజనం పెడుతున్నారంటూ అసత్య ప్రచారం చేయడం సరికాదన్నారు. పాఠశాల సమయం ముగిసిన తర్వాత కొంతమంది విద్యార్థులతో తప్పుడు ఫొటోలు దిగించి, వాటిని సోషల్ మీడియాలో ప్రచారం చేస్తూ మంత్రి పై విమర్శలు చేయడం దురుద్దేశపూరిత చర్య అని ఆరోపించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు వాస్తవాలు తెలుసునని, టీఆర్ఎస్ నాయకులు ఎంత తప్పుడు ప్రచారం చేసినా మంత్రి వివేక్ వెంకటస్వామి నిజాయితీ, నిబద్ధత రాష్ట్ర ప్రజలకు బాగా తెలుసునని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్దింటి శ్రీనివాస్, సాధబోయిన కృష్ణ, పెండ్యాల సాగర్, కరుణ్ సాగర్, పాతర్ల నాగరాజు, రాజేష్, మహేష్, చిన్న వెంకటేష్, తనుగుల సతీష్, కరీం, సలీం తదితరులు పాల్గొన్నారు.


# కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

**జిల్లా,డివిజన్ అధ్యక్షులకు నియమాక పత్రాలు అందజేత**



**మేడిపల్లి,ఫ్లాష్ఇండియా ప్రతినిధి :** మేడ్చల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ని బలోపేతం చేసి తిరుగులేని శక్తిగా తీర్చి దిద్దాలని మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రెష్ యాదవ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం నాడు బోడుప్పల్ లోని తన నివాసంలో జరిగిన సమావేశంలో మేడ్చల్ నియోజకవర్గం నుండి నూతనంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కమిటీల చోటు దక్కించుకున్నా కార్యవర్గ సభ్యులకు, నూతనంగా ఎన్నికైన డివిజన్ అధ్యక్షులకు నియమాక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా వజ్రెష్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటి వరకు పేదల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతుందని అన్నారు. ముఖ్యంగా అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, సన్న బియ్యం, తెల్ల రేషన్ కార్డుల పంపిణీ, ఉచిత విద్యుత్, ఫ్రీ బస్సు లాంటి సంక్షేమ పథకాలతో పాటు, సర్కారు బడులను బలోపేతం చేసి అట్టడుగు వర్గాలకు నాణ్యమైన ఉచిత విద్యను అందించే సంకల్పంతో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు, ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం ఏర్పాటు వంటి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి,కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్ళి ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల వివరాలను అందించాలని సూచించారు.

## గ్రామ పంచాయతీలను బలోపేతం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం




**జనగాం,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** గ్రామ పంచాయతీలను ఆర్థికంగా, పరిపాలనాపరంగా మరింత బలోపేతం చేసి గ్రామాల సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, గ్రామీణ నీటి సరఫరా శాఖ, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) స్పష్టం చేశారు. మంగళవారం, హైదరాబాదు నుంచి గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక అమలు, 16వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం, గ్రామస్థాయి అభివృద్ధి కార్యక్రమాలపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, గ్రామీణ నీటి సరఫరా శాఖ, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు)లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సందీప్ కుమార్ ఝా హాజరయ్యారు. ఈ నేపథ్యంలో మంత్రి మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు ప్రజల అవసరాలను కేంద్రంగా చేసుకుని రూపొందించాలని సూచించారు. ప్రతి గ్రామం తన అవసరాలను స్వయంగా గుర్తించి, దీర్ఘకాలిక అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని పేర్కొన్నారు. గ్రామస్థాయిలో ఖర్చు చేసే ప్రతి రూపాయి ప్రజల ప్రయోజనాల కోసమే వినియోగించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నిబంధనలకు విరుద్ధంగా నిధులు ఖర్చు చేయరాదని స్పష్టం చేశారు. నిధుల వినియోగంలో పూర్తి పారదర్శకత, జవాబుదారీతనం పాటించాలని ఆదేశించారు. 16వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై ప్రతి సర్పంచ్, గ్రామ పంచాయతీ కార్యదర్శికి పూర్తి స్థాయి అవగాహన కల్పించాలని సూచించారు. నిధుల వినియోగ మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ అభివృద్ధి పనులు చేపట్టాలని, గ్రామాల అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యతలు నిర్ణయించాలన్నారు. రేపటి నుంచి జిల్లాల వారీగా మూడు రోజుల పాటు సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులకు సమగ్ర శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి తెలిపారు. ఈ శిక్షణలో గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక , 16వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం, గ్రామ పాలన, ఆర్థిక నిర్వహణ, చట్టపరమైన అంశాలపై విస్తృతంగా శిక్షణ అందించాలని చెప్పారు. అలాగే విబిజి రామ్-జి చట్టంపై ప్రతి సర్పంచ్, కార్యదర్శికి పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని, గ్రామస్థాయిలో చట్టబద్ధమైన పరిపాలనకు ఇది ఎంతో అవసరమని పేర్కొన్నారు. శిక్షణ కార్యక్రమాలకు సంబంధిత అధికారులు, సర్పంచులు, కార్యదర్శులు విధిగా హాజరు కావాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని, నీటి కొరత (లేదా) ఇతర సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీలు బలపడితేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని, గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ.. సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాలు స్పష్టంగా నిర్వహించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డీఆర్డీఓ భాస్కర్, డిపీఓ వెంకట్ రెడ్డి, మిషన్ భగీరథ ఇంట్రా ఈఈ శ్రీకాంత్, ఇతర సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్క పోలీసు సిబ్బంది జవాబుదారీతనం తో వ్యవహరించాలి




**ఇచ్చోడ,ఫ్లాష్ ఇండియా :** ప్రతి ఒక్క పోలీసు సిబ్బంది తప్పనిసరిగా ప్రజలతో క్షేత్ర స్థాయిలో సత్సంబంధాలు కలిగి, జవాబుదారీతనంతో విధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఐపీఎస్ పేర్కొన్నారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో నూతన ఎస్‌హెచ్‌ఓ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాను గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దడంలో పోలీసు సిబ్బంది చేసిన కృషి అభినందనీయమని కొనియాడారు. గ్రామీణ స్థాయిలో ప్రజలతో ప్రతి ఒక్క పోలీసు సిబ్బంది సామరస్యపూర్వకంగా మెలగాలని సూచించారు. విధుల పట్ల క్రమశిక్షణతో పాటు నిజాయితీతో వ్యవహరిస్తూ, పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, వర్టికల్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేస్తూ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని ఆదేశించారు. ప్రతిరోజూ డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్, నంబర్ ప్లేట్ లేని వాహనాలు, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేయాలని తెలిపారు. అలాగే "కాకి కిడ్స్" కార్యక్రమం ద్వారా విద్యార్థులు, యువత, ప్రజల్లో రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. అదేవిధంగా గంజాయి నిర్మూలనలో చురుకుగా విధులు నిర్వహించి ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందికి నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉట్నూరు ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే, ఐపీఎస్, ఇచ్చోడ రూరల్ సీఐ సీహెచ్ రమేష్, ఎస్ఐ కె. నరేష్ కుమార్, ఎస్ఐలు ఈశ్వర్, రామకృష్ణతో పాటు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# చరిత్రలోనే గొప్ప ఆల్‌రౌండర్!

ఆస్ట్రేలియా మహిళల క్రికెట్ స్టార్ ఎల్లీస్ పెర్రీ మరోసారి తన అద్భుత ఆటతో ప్రపంచ క్రికెట్ అభిమానుల ప్రశంసలు అందుకుంటోంది. మహిళల టీ20 ప్రపంచ కప్‌లో ఈ ఆసీస్ అందం 7 మ్యాచ్‌లలో 198 పరుగులు చేయడమే కాకుండా 4 వికెట్లు పడగొట్టింది. మెగా టోర్నమెంట్‌లో బ్యాట్, బాల్ రెండింటితోనూ అద్భుతంగా రాణించింది. బ్యాటింగ్‌లో49.50 సగటు, 132.88 స్ట్రైక్ రేట్‌ను నమోదు చేసింది. బౌలింగ్‌లో 7.50 సగటును కొనసాగించింది. ఆసీస్ పొట్టి కప్ గెలవడంలో పెర్రీ తన వంతు పాత్ర పోషించింది. బ్యాట్‌తో పరుగులు, బంతితో వికెట్లు, కీలక మ్యాచ్‌ల్లో అద్భుత ప్రదర్శనలతో ఎల్లీస్ పెర్రీ మహిళల క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమ ఆల్‌రౌండర్లలో ఒకరిగా గుర్తింపు పొందింది. ఇప్పటికే తొమ్మిది ఐసీసీ ట్రోఫీలు గెలుచుకున్న ఆమె.. ఆస్ట్రేలియా విజయాల్లో కీలక పాత్ర పోషిస్తూ సరికొత్త చరిత్రలు సృష్టిస్తోంది. పెర్రీ కెరీర్‌లో మరో విశేషం ఏమిటంటే.. ఆమె కేవలం క్రికెటర్ మాత్రమే కాదు, ఫుట్‌బాలర్ కూడా. ఆస్ట్రేలియా తరఫున అంతర్జాతీయ స్థాయిలో క్రికెట్‌తో పాటు ఫుట్‌బాల్ కూడా ఆడిన అరుదైన క్రీడాకారిణి. రెండు క్రీడల్లోనూ దేశానికి ప్రాతినిధ్యం వహించిన ఆమె బహుముఖ ప్రజ్ఞకు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు లభించాయి. టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో 1,000కిపైగా పరుగులు చేయడంతో పాటు 100కిపైగా వికెట్లు తీసిన తొలి మహిళా క్రికెటర్ కూడా ఎల్లీస్ పెర్రీనే. బ్యాటింగ్, బౌలింగ్ రెండింట్లోనూ రాణిస్తూ మహిళల క్రికెట్‌లో కొత్త ప్రమాణాలు నెలకొల్పింది. అందుకే ఆమె ప్రపంచ క్రికెట్‌లో గొప్ప ఆల్‌రౌండర్ అయింది. టెస్టు క్రికెట్‌లోనూ పెర్రీ రికార్డులు సృష్టించింది. ఆస్ట్రేలియా మహిళా క్రికెటర్‌గా అజేయంగా 213 పరుగులు చేసి అత్యధిక వ్యక్తిగత స్కోరు నమోదు చేసిన ఆటగాడిగా నిలిచింది. వ్యక్తిగత విజయాలతో పాటు జట్టు విజయాల్లోనూ ఎల్లీస్ పెర్రీ కీలక పాత్ర పోషించింది. ఆమె ఖాతాలో ఇప్పటికే 9 ఐసీసీ ట్రోఫీలు ఉన్నాయి. అలాగే రెండుసార్లు ఉమెన్స్ బిగ్ బాష్ లీగ్ టైటిల్, ఒకసారి ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ టైటిల్‌ను కూడా గెలుచుకుంది. అంతేకాదు ఐసీసీ మహిళా క్రికెటర్ ఆఫ్ ది డికేడ్ అవార్డును సొంతం చేసుకుని తన గొప్పతనాన్ని మరోసారి నిరూపించింది. దాదాపు రెండు దశాబ్దాలుగా నిలకడగా ఆడుతున్న పెర్రీ.. ప్రపంచవ్యాప్తంగా యువ క్రికెటర్లకు ఆదర్శంగా నిలుస్తోంది. ఆమె సాధించిన విజయాలు, నెలకొల్పిన రికార్డులు మహిళల క్రికెట్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయి.

# కన్నీటి వీడ్కోలు పలికిన ఫుట్‌బాల్ దిగ్గజం



ఫుట్‌బాల్ క్రీడలో ప్రపంచ వ్యాప్తంగా ఎంతో పేరు సంపాదించుకున్న రోనాల్డో తన చివరి మ్యాచ్ ముందు సంచలన ప్రకటన చేసిన విషయం తెలిసిందే. స్పెయిన్ తో జరిగిన మ్యాచ్ లో ఓటమి తర్వాత రోనాల్డో చరిత్రలోనే అత్యంత సుదీర్ఘమైన, అద్భుతమైన ఒక సువర్ణ అధ్యాయం ముగిసింది. 2026 ఫిఫా ప్రపంచకప్ టోర్నీలో పోర్చుగల్ స్టార్ ఆటగాడు, గ్లోబల్ ఐకాన్ క్రిస్టియానో రొనాల్డో ప్రయాణం కన్నీటితో ముగిసింది. డల్లాస్‌లోని AT&T స్టేడియంలో జరిగిన హోరాహోరీ 'రౌండ్ ఆఫ్ 16' చ్‌లో బలమైన స్పెయిన్ జట్టు 1-0 తేడాతో పోర్చుగల్‌పై విజయం సాధించి క్వార్టర్‌ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. ఈ ఓటమితో పోర్చుగల్ ప్రపంచకప్ రేసు నుండి నిష్క్రమించగా.. రొనాల్డో వరల్డ్ కప్ కెరీర్‌కు అధికారికంగా తెరపడింది.

**మైదానంలోనే వెక్కివెక్కి ఏడ్చిన రొనాల్డో..**

ప్రస్తుతం 41 ఏళ్ల వయసున్న క్రిస్టియానో రొనాల్డోకు ఇదే చివరి ప్రపంచ కప్ మ్యాచ్ అని ప్రకటించాడు. తన సుదీర్ఘ కెరీర్‌లో దేశానికి ప్రపంచకప్ అందించాలనే కల నెరవేరకుండానే టోర్నీ ముగిసిపోవడంతో ఆయన తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. మ్యాచ్ ముగిసిన వెంటనే స్టేడియంలోనే మోకాళ్లపై కూలబడి వెక్కివెక్కి ఏడ్చారు. ఇతర ప్లేయర్లు, ప్రత్యర్థి జట్టు సభ్యులు ఆయనను ఓదార్చే ప్రయత్నం చేసినా రొనాల్డో కన్నీళ్లు ఆగలేదు. రొనాల్డో కన్నీటితో మైదానాన్ని వీడుతున్న దృశ్యాలు చూసి ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది ఫుట్‌బాల్ అభిమానుల గుండెలు బరువెక్కాయి. ప్రపంచకప్ గెలవలేకపోయినా.. ఐదు వేర్వేరు ప్రపంచకప్‌లలో గోల్స్ చేసిన ఏకైక ఆటగాడిగా, అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో అత్యధిక గోల్స్ చేసిన వీరుడిగా రొనాల్డో రికార్డు ఎప్పటికీ పదిలంగానే ఉంటుంది.




# భారత క్రికెట్‌లో ధోని శకం ఇలా.!

ఎంఎస్ ధోని.. ఇది పేరు కాదు.. ఒక బ్రాండ్. ప్రపంచ క్రికెట్ లో భారత్ తనదైన ముద్ర వేసుకోవడానికి ఇబ్బంది పడుతున్న సమయంలో ఆపద్బాంధవుడిలా వచ్చాడు. కెప్టెన్ గా ఎదిగిన నుండి వరుసగా ఐసీసీ ట్రోఫీలను గెలుస్తూ.. క్రికెట్ అంటే భారత్ అనేలా నిరూపించాడు. మ్యాచ్ లో పరిస్థితి ఎంత క్లిష్టంగా ఉన్న అవన్నీ మనకు కాదు అన్నట్లుగా ఎంతో కూల్ గా వికెట్ల వెనకాల నిలబడి జట్టును విజయతీరాలకు చేర్చేవాడు. భారత క్రికెట్ చరిత్రలో అత్యంత విజయవంతమైన కెప్టెన్లలో ఒకరిగా గుర్తింపు పొందిన ధోని నేడు (జూలై 7) తన 45వ పుట్టినరోజును జరుపుకుంటున్నారు. 'కెప్టెన్ కూల్'గా అభిమానుల మన్ననలు పొందిన ధోనీ జీవితం, కెరీర్ ప్రపంచ క్రీడా చరిత్రలోనే అత్యంత స్ఫూర్తిదాయకమైన ప్రయాణాల్లో ఒకటి. రైల్వే స్టేషన్‌లో టికెట్ కలెక్టర్‌గా పనిచేసిన స్థాయి నుంచి భారత జట్టుకు మూడు ఐసీసీ ట్రోఫీలు అందించిన దిగ్గజ కెప్టెన్‌గా ఎదిగిన ఆయన ప్రస్థానం యువతకు ఎంతో ఆదర్శం. 2004లో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన ధోనీ.. తన ధనాధన్ బ్యాటింగ్‌తో త్వరగానే ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. ఆ తర్వాత మ్యాచ్ ఫినిషర్‌గా, వ్యూహాత్మక కెప్టెన్‌గా ఎదిగి భారత జట్టుకు ఎన్నో చిరస్మరణీయ విజయాలు అందించాడు. ధోనీ నాయకత్వంలో భారత్ 2007లో తొలి ఐసీసీ టీ20 వరల్డ్ కప్ ను గెలుచుకుంది. ఆ తర్వాత 2011లో ఐసీసీ క్రికెట్ వరల్డ్ కప్ ను, 2013లో ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీని కైవసం చేసుకుని ప్రపంచ క్రికెట్‌లో అరుదైన ఘనత సాధించాడు. మూడు ప్రధాన ఐసీసీ ట్రోఫీలను గెలిచిన ఏకైక భారత కెప్టెన్‌గా ధోనీ చరిత్ర సృష్టించాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో ధోనీ మొత్తం 538 మ్యాచ్‌లు ఆడి 17,266 పరుగులు చేశాడు. వికెట్ కీపర్‌గా 829 డిస్మిసల్స్ నమోదు చేసి అరుదైన రికార్డులు సొంతం చేసుకున్నాడు. వన్డే క్రికెట్‌లో ధోనీ 350 మ్యాచ్‌లు ఆడి 50.57 సగటుతో 10 సెంచరీలు, 73 అర్ధ సెంచరీలతో 10,773 పరుగులు చేశాడు. అత్యధిక వ్యక్తిగత స్కోరు అజేయంగా 183 పరుగులు. భారత తరఫున అత్యధిక వన్డే పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో ధోని ఆరో స్థానంలో ఉన్నాడు. వన్డే కెప్టెన్‌గా ధోనీ 200 మ్యాచ్‌ల్లో భారత జట్టును నడిపించాడు. ఇందులో 110 విజయాలు సాధించి 55 శాతం విజయాల శాతాన్ని నమోదు చేశాడు. టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో 98 మ్యాచ్‌లు ఆడి 1,617 పరుగులు చేశాడు. కెప్టెన్‌గా 72 మ్యాచ్‌ల్లో జట్టును నడిపించి 41 విజయాలు అందించాడు. టెస్టు క్రికెట్‌లో ధోనీ 90 మ్యాచ్‌లు ఆ డి 6 సెంచరీలు, 33 అర్ధ సెంచరీలతో 4,876 పరుగులు చేశాడు. అత్యధిక స్కోరు 224 పరుగులు. టెస్టు కెప్టెన్‌గా 60 మ్యాచ్‌ల్లో భారత్‌కు నాయకత్వం వహించి 27 విజయాలు సాధించాడు. అతని నాయకత్వంలోనే భారత జట్టు తొలిసారిగా ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో నంబర్-1 స్థానాన్ని కూడా అందుకుంది. అంతేకాకుండా.. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో ఆస్ట్రేలియాపై 4-0 తేడాతో వైట్‌వాష్ నమోదు చేసిన ఏకైక భారత కెప్టెన్‌గా కూడా ధోనీ ప్రత్యేక గుర్తింపు పొందాడు. 2010-11, 2012-13 సిరీస్‌లలో భారత్ ఈ ఘనత సాధించింది.


# బిజినెస్

## హెరిటేజ్ ఫుడ్స్‌కు ఎఫ్ఎస్ఎస్ఏఐ నోటీసులు




వినియోగదారులను తప్పుదోవ పట్టించే ప్రకటనలపై ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) మరోసారి కఠిన వైఖరి అవలంబించింది. ప్రముఖ డెయిరీ సంస్థ హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ విక్రయిస్తున్న 'ఫ్రెష్ పనీర్' ఉత్పత్తిపై చేసిన యాడ్స్ నిబంధనలకు అనుగుణంగా లేవని పేర్కొంటూ కంపెనీకి షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఆహార భద్రత, ప్రమాణాల చట్టం--2006 ప్రకారం ఎందుకు చర్యలు తీసుకోకూడదో 7 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రకారం, 'ఫ్రెష్' అనే పదాన్ని ఉపయోగించాలంటే షెడ్యూల్--5లో నిర్దేశించిన ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలి. అయితే హెరిటేజ్ ప్రొడక్ట్ ఆ ప్రమాణాలను అందుకోలేదని, అయినప్పటికీ 'ఫ్రెష్ పనీర్'గా ప్రచారం చేయడం వినియోగదారులను తప్పుదోవ పట్టించే అవకాశముందని పేర్కొంది. అంతేకాకుండా, ఉత్పత్తిపై ఉపయోగించిన 'హెల్తీ హ్యాపీనెస్' అనే బ్రాండింగ్‌లోని 'హెల్తీ' పదంపైనా ఎఫ్ఎస్ఎస్ఏఐ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ పదం వల్ల ప్రొడక్ట్ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందనే భావన వినియోగదారుల్లో కలిగే అవకాశం ఉందని, ఇది ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ (అడ్వర్టైజింగ్ అండ్ క్లెయిమ్స్) రెగ్యులేషన్స్--2018 నిబంధనలకు విరుద్ధమని తెలిపింది. వినియోగదారుల ఫిర్యాదులు, అలాగే స్వీయ పరిశీలన (సుమోటో) ఆధారంగా ఈ చర్యలు తీసుకున్నట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ వెల్లడించింది. ఇటీవల ఆహార ఉత్పత్తులపై తప్పుదోవ పట్టించే ప్రకటనలు, క్లెయిమ్‌ల విషయంలో నియంత్రణ సంస్థ మరింత కఠినంగా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే.

# అదానీ నెక్ట్స్ టార్గెట్ ఆ రెండు...



దేశీయ మౌలిక సదుపాయాల (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) రంగంలో దూసుకుపోతున్న పారిశ్రామిక దిగ్గజం గౌతమ్ అదానీ మరో భారీ ప్లాన్ చేశారు. సిమెంట్, రాగి (కాపర్) వ్యాపారాల్లో సత్తా చాటిన అదానీ గ్రూప్.. ఇప్పుడు దేశంలోనే అత్యంత కీలకమైన అల్యూమినియం రంగంలోకి అడుగుపెడుతోంది. దీనికోసం అబుదాబికి చెందిన 'ఇంటర్నేషనల్ హోల్డింగ్ కంపెనీ' తో కలిసి అదానీ గ్రూప్ 50:50 షేర్‌తో ఒక జాయింట్ వెంచర్‌ను ఏర్పాటు చేసింది. ఈ భాగస్వామ్యం కింద ఒడిశాలో ఏకంగా రూ. 1.1 లక్షల కోట్ల (11.5 బిలియన్ డాలర్లు) భారీ పెట్టుబడి పెట్టనున్నారు. భారత మెటల్ రంగా చరిత్రలోనే ఇది అతిపెద్ద ఇన్వెస్ట్‌మెంట్‌లలో ఒకటిగా నిలవనుంది.

**ఇద్దరు దిగ్గజాల గుత్తాధిపత్యానికి బ్రేక్**

ప్రస్తుతం భారత అల్యూమినియం మార్కెట్‌పై హిందాల్కో, వేదాంత కంపెనీలదే పూర్తి హవా నడుస్తోంది. దేశీయ మొత్తం ఉత్పత్తిలో 90 శాతానికి పైగా వాటా ఈ రెండు సంస్థలదే. మైనింగ్, రిఫైనరీ, పవర్ ప్లాంట్, లాజిస్టిక్స్ వంటి భారీ నెట్‌వర్క్ అవసరం కాబట్టి ఈ రంగంలో కొత్త ప్లేయర్స్ రావడం అంత సులువు కాదు. కానీ అదానీ గ్రూప్ ఒడిశాలో పూర్తి స్థాయి ఇంటిగ్రేటెడ్ ప్లాంట్‌ను నిర్మిస్తోంది. ఇందులో ఏటా 40 లక్షల టన్నుల సామర్థ్యం గల అల్యూమినా రిఫైనరీ, 20 లక్షల టన్నుల అల్యూమినియం స్మెల్టర్, 4000 మెగావాట్ల పవర్ ప్లాంట్‌తో పాటు 10 లక్షల టన్నుల డౌన్‌స్ట్రీమ్ మాన్యుఫ్యాక్చరింగ్ పార్క్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నారు. దేశంలో ఏడాదికి 42 లక్షల టన్నుల ఉత్పత్తి జరుగుతుండగా.. అదానీ ప్లాంట్ ద్వారా మరో 20 లక్షల టన్నుల అదనపు ఉత్పత్తి రానుంది.


**అసలు వ్యూహం ఇదే..**

భారత్ ప్రపంచంలోనే రెండో అతిపెద్ద అల్యూమినియం ఉత్పత్తి దేశమైనప్పటికీ, దేశీయ అవసరాల కోసం ఇప్పటికీ దిగుమతులపైనే ఆధారపడుతోంది. ప్రస్తుతం దేశంలో అల్యూమినియం వినియోగం 55 లక్షల టన్నులుగా ఉండగా.. అది 2030 నాటికి 85 లక్షల టన్నులకు, 2047 నాటికి 2.8 కోట్ల టన్నులకు చేరుకుంటుందని అంచనా. ప్రపంచ సగటు ప్రతి వ్యక్తి వినియోగం 8-12 కిలోలు ఉంటే.. భారత్‌లో అది కేవలం 3.4 -- 3.9 కిలోలు మాత్రమే ఉంది. భవిష్యత్తులో వాహనాలు, ఎలక్ట్రిక్ వైర్లు, నిర్మాణ రంగానికి రాబోయే భారీ డిమాండ్‌ను క్యాష్ చేసుకోవడమే తమ లక్ష్యమని కరణ్ అదానీ స్పష్టం చేశారు. అల్యూమినియం తయారీలో అత్యధిక ఖర్చు విద్యుత్ కోసమే అవుతుంది. అదానీ గ్రూప్‌నకు ఇప్పటికే దేశంలో భారీ పవర్ జనరేషన్ పోర్ట్‌ఫోలియో ఉంది. ఈ ప్రాజెక్ట్ కోసం 4 గిగావాట్ల క్యాప్టివ్ పవర్ ప్లాంట్‌తో పాటు 400 మెగావాట్ల గ్రీన్ ఎనర్జీని కూడా వాడుకోనున్నారు. ఈ చౌక విద్యుత్ అదానీకి మార్కెట్లో పెద్ద అడ్వాంటేజ్‌గా మారనుందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. అలాగే భారత దేశంలోని సగానికి పైగా బాక్సైట్ నిల్వలు ఒడిశాలోనే ఉన్నాయి. రాయగడ జిల్లాలోని మైన్స్‌కు దగ్గరగా రిఫైనరీ, సుందర్‌గఢ్‌లో స్మెల్టర్ ప్లాంట్‌ను ప్లాన్ చేశారు. ముడిసరుకు రవాణా కోసం అదానీ గ్రూప్‌నకు చెందిన 'ధామ్రా పోర్ట్'ను, ప్రత్యేక రైల్వే కన్వేయర్ బెల్ట్ నెట్‌వర్క్‌ను ఉపయోగించనున్నారు.

# తగ్గిన బంగారం ధరలు..



బంగారం కొనాలనుకునేవారికి శుభవార్త. అంతర్జాతీయ భౌగోళిక కారణాల నేపథ్యంలో బంగారం ధరలు తగ్గుదల నమోదు చేశాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, మంగళవారం ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ. 1,45,260గా ఉంది. నిన్నటితో పోల్చుకుంటే రూ. 1360 తగ్గింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ. 1,33,150గా ఉంది. నిన్నటితో పోల్చుకుంటే రూ. 1250 తగ్గింది



# యాపిల్ కీలక నిర్ణయం

గ్లోబల్ టెక్ దిగ్గజం యాపిల్ కీలక నిర్ణయం తీసుకుంది. భారత్‌లో యాప్ స్టోర్, ఐక్లౌడ్ సేవల కోసం మళ్లీ క్రెడిట్, డెబిట్ కార్డులతో చెల్లింపులు చేసే అవకాశం కల్పించేందుకు కంపెనీ సిద్ధమవుతోంది. జాతీయ మీడియా కథనాల ప్రకారం, దాదాపు ఐదేళ్ల విరామం తర్వాత ఈ సౌకర్యాన్ని కంపెనీ తిరిగి ప్రారంభించింది. ప్రస్తుతం ఈ ఫీచర్‌ను కొద్దిమంది వినియోగదారులతో పరీక్షిస్తుండగా, రాబోయే కొన్ని నెలల్లో అందరికీ అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తోంది. 2021లో భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) కార్డ్ టోకనైజేషన్ నిబంధనలు అమల్లోకి రావడంతో యాపిల్ భారత్‌లో కార్డ్ పేమెంట్స్‌ను నిలిపివేసింది. అప్పటి నుంచి యాప్ స్టోర్ కొనుగోళ్లు, ఐక్లౌడ్ సబ్‌స్క్రిప్షన్లకు వినియోగదారులు యూపీఐ లేదా నెట్‌బ్యాంకింగ్ ద్వారానే చెల్లింపులు చేయాల్సి వచ్చేది. ఇప్పుడు ఆర్‌బీఐ నిబంధనలకు అనుగుణంగా మార్పులు పూర్తి చేయడంతో కార్డ్ పేమెంట్స్‌ను తిరిగి ప్రారంభించినట్లు సమాచారం. ఆర్‌బీఐ టోకనైజేషన్ నిబంధనల ప్రకారం, వ్యాపార సంస్థలు వినియోగదారుల అసలు కార్డ్ వివరాలను తమ సర్వర్లలో నిల్వ చేయకూడదు. వాటి స్థానంలో టోకనైజ్డ్ డేటా మాత్రమే ఉపయోగించాలి. అలాగే భారత వినియోగదారులకు సంబంధించిన ఈ డేటా భారత్‌లోనే నిల్వ ఉండాలి. ఈ నిబంధనలకు అనుగుణంగా యాపిల్ తన చెల్లింపుల వ్యవస్థను మార్చినట్లు తెలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా టోకనైజ్డ్ డేటాను అమెరికా, డెన్మార్క్, చైనా సర్వర్లలో నిల్వ చేస్తున్నప్పటికీ, భారత వినియోగదారుల డేటాను విదేశీ సర్వర్లలో మిర్రర్ చేయడం లేదని నివేదిక పేర్కొంది. ఇదే సమయంలో, భారత్‌లో యాపిల్ పే సేవలను ప్రారంభించేందుకు కూడా యాపిల్ బ్యాంకులు, కార్డ్ నెట్‌వర్క్‌లతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. దీంతో రాబోయే రోజుల్లో దేశీయ యాపిల్ వినియోగదారులకు చెల్లింపుల విషయంలో మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది.



# ఆ ఒక్కరి కోసమే...

"ఇప్పుడు నేను ఏ ప్రాజెక్ట్ ఓకే చేసినా నా కొడుకు నీల్ దృష్టి నుంచే ఆలోచిస్తాను. వాడు పెద్దయ్యాక 'మమ్మా చేసిన గ్రేట్ సినిమా ఇది' అని గర్వంగా చెప్పుకునేలా నా లైనప్ ఉండాలనుకుంటున్నా. అందుకే స్క్రిప్ట్స్ విషయంలో మరింత జాగ్రత్తగా ఉంటున్నాను" అని చెప్పారు. చేతన్ డీకే దర్శకత్వంలో శ్రేయస్ తల్పడేతో కలిసి ఆమె నటించిన 'ది ఇండియా స్టోరీ' జూలై 24న థియేటర్లలోకి రాబోతుంది. ఈ సినిమాలో కాజల్ లాయర్ పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం గురించి చెప్తూ.. "కల్తీ ఆహారం, పురుగుమందుల వాడకం వల్ల ప్రజల ప్రాణాలు ఎలా బలి అవుతున్నాయనే కథ నన్ను తీవ్రంగా ఆలోచింపజేసింది. ఈ సినిమా కోసం చేసిన రీసెర్చ్ విన్నాక.. నా కిచెన్‌లో ఏ వస్తువులు ఉంచాలి, నీల్‌కు ఎలాంటి ఫుడ్ ఇవ్వకూడదో అప్పటికప్పుడే నిర్ణయించుకుని మార్పులు చేసేశాను" అంటూ కాజల్ అగర్వాల్ చెప్పుకొచ్చారు.ఇక నితేష్ తివారీ దర్శకత్వంలో యశ్, రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవి ప్రధాన పాత్రల్లో వస్తున్న 'రామాయణ: పార్ట్ 1' దీపావళికి రిలీజ్ కానుంది. ఈ చిత్రంలో కాజల్ 'మండోదరి' పాత్ర పోషిస్తున్నారు. "నీల్‌కు రామాయణం అంటే చాలా ఇష్టం. ఇంట్లో రోజూ రామలీలా చూస్తాడు. నేను ఈ సినిమాలో నటిస్తున్నానని చెప్పగానే వాడు ఎగ్జైట్ అయ్యాడు. విచిత్రమేంటంటే వాడికి రావణుడి పాత్రే ఇష్టం (నవ్వుతూ). రామాయణ పార్ట్ 2 వచ్చేసరికి వాడికి ఐదేళ్లు వస్తాయి. నీల్ థియేటర్‌లో చూసే మొదటి సినిమా ఇదే అవుతుంది" అని కాజల్ వెల్లడించారు.




## ఊహకే అందని 'రోమాంచకం'..

భద్రకాళీ పిక్చర్స్, డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా కాంబోలో రాబోతున్న యూనిక్ లవ్ స్టోరీ 'రోమాంచకం'. సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్ కుమార్ జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని సందీప్ రెడ్డి వంగా సమర్పిస్తుండగా, ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తున్నారు. నూతన దర్శకుడు వేణుగోపాల్ రెడ్డి రూపొందిస్తున్నారు. ఈ మూవీ నుంచి ఇప్పటికే రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ ఆడియెన్స్‌ను అట్రాక్ట్ చేసి మంచి రెస్పాన్స్ తెచ్చుకోగా.. తాజాగా గ్లింప్స్ రిలీజ్ చేశారు మేకర్స్. ఈ గ్లింప్స్ డీవోపీ పవన్ పప్పుల అందించిన పెయింటింగ్ లాంటి బ్యూటిఫుల్ విజువల్స్‌తో, వాసుకి వైభవ్ కంపోజ్ చేసిన స్వీట్ మెలోడియస్ ట్యూన్‌తో సాగుతూ హీరో,హీరోయిన్ మధ్య ఉన్న ప్రేమను, వారి మధ్య ఏర్పడిన దూరాన్ని చూపిస్తూ సాగింది. 'అణువు అణువును ఉద్రూతలూపే ప్రణయ కల్లోలమే.. రోమాంచకం, ఊహకే అందని ఉవ్వెత్తు-నెగిసే ఉత్తుంగ తరంగమే.. రోమాంచకం..' అంటూ గ్లింప్స్‌లో వచ్చిన లిరిక్స్ ఈ మూవీ ఎంత వైబ్రేటింగ్‌గా ఉండబోతుందో తెలియజేస్తోంది. సుమంత్ ప్రభాస్, అనంతిక జంట కెమిస్ట్రీ ఈ సినిమాకు హైలైట్‌గా నిలుస్తుండగా.. త్వ-రలోనే రిలీజ్‌కు సంబంధించిన అప్డేట్స్ పంచుకోనున్నారు మేకర్స్.



## సెట్స్ నుంచి దుల్కర్ సల్మాన్

దుల్కర్ సల్మాన్ నటిస్తున్న తెలుగు చిత్రం 'ఆకాశంలో ఒక తార'. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా సెట్స్ నుంచి దుల్కర్ సల్మాన్ తాజాగా షేర్ చేసిన బిహైండ్ ది సీన్స్ వర్కింగ్ స్టిల్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ ఒక్క ఫొటోతోనే సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగింది. మలయాళం, తెలుగు, తమిళం, హిందీ భాషల్లో తనదైన నటనతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న దుల్కర్ సల్మాన్, ప్రతి సినిమాలో కొత్తదనానికి ప్రాధాన్యం ఇస్తుంటారు. అదే తరహాలో ఇప్పుడు 'ఆకాశంలో ఒక తార' కూడా విభిన్నమైన కథాంశంతో తెరకెక్కుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పుడు షూటింగ్ సెట్స్‌లో తీసిన తాజా ఫొటో అభిమానులను ఆకట్టుకుంటోంది. ఈ ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేసిన వెంటనే వేలాది మంది అభిమానులు స్పందిస్తూ సినిమాపై తమ అంచనాలను వ్యక్తం చేస్తున్నారు.ఈ చిత్రానికి ప్రతిభావంతుడైన దర్శకుడు పవన్ సాధినేని దర్శకత్వం వహిస్తున్నారు.
సెంటిమెంట్ కు పెద్దపీట వేస్తూనే వినూత్న కథలను తెరకెక్కించే దర్శకుడిగా ఆయనకు మంచి పేరు ఉంది. ఇప్పుడు దుల్కర్ సల్మాన్‌తో ఆయన చేస్తున్న ఈ ప్రాజెక్ట్ కూడా అదే స్థాయిలో ప్రత్యేకంగా ఉండబోతుందనే టాక్ వినిపిస్తోంది. కథకు తగ్గట్టుగా దుల్కర్ కోసం పూర్తిగా కొత్త లుక్‌ను డిజైన్ చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ సినిమా నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. చిత్రబృందం షూటింగ్‌ను త్వరితగతిన పూర్తి చేసి, తదుపరి ప్రమోషన్లపై దృష్టి పెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. దుల్కర్ సల్మాన్ గత చిత్రాల మాదిరిగానే ఈ సినిమాలో కూడా సెంటిమెంట్ పాత్రలో కనిపించనున్నారనే ప్రచారం జరుగుతోంది. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్, టీజర్ లేదా విడుదల తేదీపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



## మైండ్లో పెద్ద స్కెచ్చే ఉందిగా!

టాలీవుడ్ మోస్ట్ హ్యాండ్సమ్ హీరో అఖిల్ అక్కినేని తన కెరీర్‌లో ఒక సాలిడ్ సక్సెస్, సరైన కమ్‌బ్యాక్ బ్రేక్ కోసం చాలా కాలంగా ఎదురుచూస్తున్నారు. ఈ జూలై 10న ఆయన హీరోగా తెరకెక్కిన లెనిన్ సినిమా ప్రేక్షకుల ముందుకు గ్రాండ్‌గా రాబోతుంది. ఈ క్రమంలో అఖిల్ తన నెక్ట్స్ సినిమాల లైనప్ విషయంలో ఒక పక్కా వ్యూహంతో, స్ట్రాంగ్ ప్లానింగ్‌తో ముందుకు సాగుతున్నట్లు ఫిలిం నగర్ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. ఇండస్ట్రీలోని మోస్ట్ డిమాండింగ్ అండ్ టాప్ డైరెక్టర్లతో పని చేయాలనే బలమైన కోరిక అఖిల్ మైండ్‌లో ఉందని తెలుస్తోంది.ముఖ్యంగా టాలీవుడ్ సెన్సేషనల్ డైరెక్టర్స్ అయిన సుకుమార్, గ్లోబల్ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి, మాస్ పల్స్ తెలిసిన ప్రశాంత్ నీల్ వంటి టాప్ మేకర్స్‌తో భారీ ప్రాజెక్ట్స్ చేయడమే లక్ష్యంగా అఖిల్ అడుగులు వేస్తున్నారట. కథల ఎంపికలో సరికొత్త వైవిధ్యం చూపిస్తూ.. భవిష్యత్తులో ఈ క్రేజీ దర్శకులను మెప్పించేలా తనను తాను సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం. అయితే ఇలాంటి స్టార్ డైరెక్టర్ల కాంబినేషన్ సెట్ అవ్వాలంటే ముందుగా బాక్సాఫీస్ వద్ద తన సత్తా ఏంటో నిరూపించుకోవాలని, కమర్షియల్ మార్కెట్‌ను స్ట్రాంగ్‌గా బిల్డ్ చేసుకోవాలని అఖిల్ భావిస్తున్నారట. అందుకోసమే లూజ్ ప్లానింగ్స్ పక్కన పెట్టి, కేవలం కరెక్ట్ టైమింగ్, పవర్‌ఫుల్ కంటెంట్ ఉన్న కథలపైనే పూర్తి ఫోకస్ పెడుతున్నట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో భారీ అంచనాలతో వస్తున్న 'లెనిన్' చిత్రం అఖిల్ కెరీర్‌కు ఎంతో కీలకంగా మారిందని ట్రేడ్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ మాస్ యాక్షన్ ఎమోషనల్ డ్రామాతో తన టాలెంట్‌ను ప్రూవ్ చేసుకుని, ఆ తర్వాతే ఆ టాప్ డైరెక్టర్ల వైపు అడుగులు వేయాలని అఖిల్ గట్టి నిశ్చయంతో ఉన్నారట.




## బ్లాక్ బస్టర్ హిట్ కన్ఫర్మ్..

అక్కినేని అఖిల్ ఫ్యాన్స్ ఎంతో ఈగర్‌గా వెయిట్ చేస్తున్న 'లెనిన్' జులై 10న ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధంగా ఉంది. మురళీ కిషోర్ అబ్బూరు తెరకెక్కించిన ఈ రూరల్ యాక్షన్ డ్రామా ప్రమోషన్స్‌లో జోరు పెంచిన చిత్ర బృందం తాజాగా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను గ్రాండ్‌గా నిర్వహించారు. ఈ ఈవెంట్‌లో పాల్గొన్న నిర్మాత నాగవంశీ 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమాపై ఆసక్తికర కామెంట్స్ చేశారు. 'నేను ఇప్పటికే 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమా చూశాను. ఇది 200% బ్లాక్‌బస్టర్ చిత్రం. ఇది అందరి భావోద్వేగాలను తాకేలా ఉండే, హృదయానికి హత్తుకునే కుటుంబ కథా చిత్రం. భారీ విడుదలకు సిద్ధంగా ఉండండి' అంటూ మూవీపై భారీ హైప్ క్రియేట్ చేశాడు. కాగా.. కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, యంగ్ బ్యూటీ మమితా బైజు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ మూవీకి వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్నాడు. తమిళంతో పాటు తెలుగులో ఏకకాలంలో వచ్చేందుకు సిద్ధం అవుతున్న ఈ రొమాంటిక్ ఫ్యామిలీ డ్రామాను సితార ఎంటర్‌టైన్మెంట్స్ నిర్మిస్తుంది. జీ.వీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నాడు.




## ఆడియన్స్ మరోసారి ప్రూవ్

యంగ్ హీరోయిన్ నభా నటేష్ తాజాగా 'నాగబంధం' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. విరాట్ కర్ణ హీరోగా, అభిషేక్ నామా దర్శకత్వంలో వచ్చిన ఈ భారీ పౌరాణిక యాక్షన్ అడ్వెంచర్‌లో జగపతి బాబు, మహేష్ మంజ్రేకర్, ఐశ్వర్య మీనన్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. జులై 3న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు వచ్చిన ఈ చిత్రం ప్రస్తుతం సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతుంది. ఈ సందర్భంగా తాజాగా ఏర్పాటు చేసిన థాంక్యూ మీట్‌లో నభా నటేష్ సినిమాపై ఆసక్తికర కామెంట్స్ చేసింది. 'ఇందులో నేను చేసిన పార్వతి పాత్రకు వస్తున్న స్పందన పట్ల నిజంగా ఎంతో సంతోషంగా ఉంది. అయితే.. రివ్యూవర్స్ అంటే మాకు చాలా గౌరవం. కానీ చాలా మంది తప్పుడు రివ్యూస్ ఇస్తున్నారు. అసలు సినిమా కూడా చూడకుండా ట్వీట్స్ వేస్తున్నారు. కానీ, సినిమా చూస్తున్నప్పుడు ఓ వ్యక్తి నాతో 'నేను ఈ సినిమా చూశాను. చాలా అద్భుతంగా ఉంది. అందుకే మా అమ్మకు, నాన్నమ్మకు కూడా చూపించాలని వాళ్లను తీసుకుని రెండోసారి వచ్చాను అని చెప్పారు. చాలా మంది మా సినిమాను ఆదరిస్తున్నారు. నిజంగా కంటెంట్ బాగుంటే సినిమాను సక్సెస్ చేస్తారని ఆడియన్స్ మరోసారి ప్రూవ్ చేసుకున్నారు' అంటూ ఆనందం వ్యక్తం చేసింది.

## విడుదలకు ముందే చిక్కుల్లో కంగనా సినిమా..



తాజా సమాచారం ప్రకారం, ఫాంటమ్ స్టూడియోస్ సంస్థ జియోస్టార్పై బాంబే హైకోర్టులో రూ.250 కోట్ల దావా వేసింది. 'క్వీన్ 2' అనేది అనుమతి లేకుండా రూపొందించిన సీక్వెల్ అని, 'క్వీన్' చిత్రానికి సంబంధించిన ఐపీ హక్కుల్లో తమకు 50 శాతం వాటా ఉందని, భవిష్యత్తులో సీక్వెల్స్ నిర్మించే హక్కులు కూడా అందులో భాగమేనని ఫాంటమ్ స్టూడియోస్ పేర్కొంది. అయితే తమ అనుమతి లేకుండానే ఈ చిత్రాన్ని నిర్మించారని కోర్టులో వాదిస్తోంది. న్యాయస్థానాన్ని ఆశ్రయించే ముందు సమస్యను పర-స్పర చర్చల ద్వారా పరిష్కరించేందుకు ప్రయత్నించినట్లు కూడా సమాచారం. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఫాంటమ్ స్టూడియోస్ బహిరంగ ప్రకటన విడుదల చేయడంతో పాటు, జియోస్టార్, దర్శకుడు వికాస్ బహ్ల్‌తో పలు దఫాలుగా చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. అయితే ఆశించిన పరిష్కారం రాకపోవడంతో పాటు, సినిమా షూటింగ్ పూర్తయిందని తెలిసిన తర్వాతే కోర్టును ఆశ్రయించినట్లు నివేదికలు చెబుతున్నాయి.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**